# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 38 సంచిక 11

పేజీలు 44

జులై 2019

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................ ....... పేజీ**

భద్రవాక్యం ........................................4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 6
అమ్మమాట........................................ 10
శ్రీమాతాజీవారి ఆశ్రమేతర కార్యక్రమములు.................. ..........12
వేసవిలో శిక్షణా తరగతులు నివేదిక ..13
రామాయణంలో స్త్రీ పాత్రలు ......................14
అహం భావన ...................... ...........16
నిత్యసాధన .... ........... . ..... ......................17
తిరునీలకంఠ నాయనారు ......................19
మోక్షార్థత ........................................21
శ్వేత వస్త్రం ........................................22
సప్తసప్తాహాల సత్సంగ సమావేశాలు - విజ్ఞప్తి 23
మనస్సును నియంత్రించడం ఎలా?....24
చిదంబరేశ్వరుడి ఆజ్ఞ .......... ......................26
బుద్ధిర్ యస్య - బలం తస్య ... ................28
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు......................30
శ్రీకృష్ణ కర్ణామృతము ......................31
పరిప్రశ్న ........................................ 32
చిత్త కుసుమం ... ..... ......................34
కైవల్యోపనిషత్ ... ......................36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
శ్రీమాతాజీ విదేశ పర్యటన కార్యక్రమాలు 40
విష్ణు కథలు ...... ...................... ................41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

## అమృతబిన్దూపనిషద్

**శ్లో॥ 10.**

**ననిరోధో నచోత్పత్తిః న బద్ధో నచ సాధకః ।**
**న ముముక్షుః నైవ ముక్తః ఇత్యేషా పరమార్థతా ॥**

పతంజలి తన యోగ సూత్రాలలో వ్యుత్థాన సంస్కారం, నిరోధ సంస్కారం అని రెండు విధాలుగా చూపించారు. దుష్ట సంస్కారములు, వ్యావహారిక సంస్కారములను వ్యుత్థాన సంస్కారములు అన్నారు. అవి మాటిమాటికి త్రిగుణాత్మక ప్రవృత్తి కారణంగా చిత్తంలో చెలరేగుతూ వుంటాయి. వీటిని నిరోధించే సాధన సంస్కారములను నిరోధ సంస్కారము అన్నారు.

వ్యుత్థాన, నిరోధ సంస్కారములు పరమార్థం కాదు. నిర్బీజ స్థితి పరమార్థం. వ్యుత్థాన, నిరోధ సంస్కారములచేత బద్ధమగుట, బంధం నుండి సాధన చేయుట, ముక్తిని కోరుట, ముక్తుడనైనానని భావించుట ఇవేవీ పరమార్థం కాదు. ఈ దశలన్నింటినీ అతిక్రమించుట పరమార్థం.

వ్యుత్థాన సంస్కారంలో ఊగిసలాడేవాడు పరమార్థాన్ని పొందిన బుధుడు కాడు. వ్యుత్థాన సంస్కారం నుండి గుణపాఠం పొందటం మంచిదే. కానీ తరువాత ఇంకా చాలా వున్నది. తనను ఉద్ధరించు కోవడానికి గుణపాఠం పొందినవాడు బుధుడు కాడు. నిరోధ సంస్కారం వ్యుత్థాన సంస్కారాలను నిరోధించడానికి అవసరమేకానీ, ఇదే పూర్తి పరమార్థం కాదు. నిరోధ సంస్కారంతో సాధన చేసే సాధకుడు కూడా బుధుడు కాదు. ఎందుకంటే క్రమం తప్పుట, విపరీత ధోరణి, పతనం వంటి అవకతవకలను అతిక్రమించిన తరువాత సాధన సాగరంలో చాలా ముందంజ వేయాలి. ఇదీ గడిచి ముముక్షువే అయినా, ముముక్షుత్వమందు పక్వమైతేనే గదా పురోభివృద్ధి. దిగితేనే లోతు తెలుస్తుంది. సూక్ష్మాతిసూక్ష్మమైన సాధనాంశములను పరిష్కరించి వుత్తీర్ణుడు కావలసిన దశ ముముక్షుత్వమే.

అలౌకిక సాధన, తత్త్వదృష్టి, నిశ్చల జ్ఞానము అలవడాలి. వాటిల్లో నిశ్చలంగా నిలవాలి. ముక్తుడైనానని అనుకున్నప్పటికీ తన స్థితి అసమగ్రమే, భ్రాంతియే. ఎందుకంటే ఒకప్పటి ఊహించుకున్న బంధన దశతో

పోల్చుకుని, ఇప్పుడు ముక్తుడనైనానని అనుకోవటమే జరుగుచున్నది. అనుకొనుట సాపేక్ష స్థితి కాదు ముక్తి, అనుకున్నా, అనుకోకున్నా తాను ముక్తుడే.

బంధం - ముక్తి అనే పదములు, పదార్థములు, స్థితులు, సృష్టి పరములు, జీవభావములు, ఆత్మకు సృష్టితోగాని, జీవునితోగాని సంబంధం లేదు. సృష్టి జీవ భావములతో కూడి వున్నది. అభావములైనది ఆత్మ సామ్రాజ్యం. ఇది పరమార్థత.

మొదటి స్థితి వ్యుత్థాన సంస్కారం - ఆపదలను పొందుట అనే క్రియను, మథనం చేయుట అనే ప్రవృత్తిని తన వ్యుత్థాన సంస్కారం చేత, ఆశీర్వదించుకుని, అంగీకరించి, కోరి, తన జీవితానికి జీవన కిరణంగా, జీవితాశయంగా చేసుకుని అటువంటి కిరణములకు ప్రకాశించే స్థానంగా తన జీవితాన్ని తీర్చుకుని భరిస్తున్నవాడు అవుతున్నాడు.

రెండవ దశ నిరోధ సంస్కారం. మనస్సు వ్యుత్థాన సంస్కార వీధులలో తిరగటానికి కాదని గుణపాఠం పొంది మనస్సు వ్యుత్థాన సంస్కారమును నిరోధించే విచారణా విహరణములకు తన ప్రవృత్తిని నివృత్తి పథంలోకి మళ్ళించుకుని, ఆ విధంగా తనను ఆశీర్వదించుకుని, అంగీకరించి, కోరి తన సాధనా జీవితానికి, జీవన కిరణంగా సాధన జీవితాశయంగా చేసుకుని అటువంటి కిరణములకు ప్రకాశించే స్థానంగా తన జీవితాన్ని, సాధననూ తీర్చుకుని భరిస్తున్నవాడు అవుతున్నాడు, అలంకరించుకుంటున్న వాడవుతున్నాడు.

మూడవ దశ నిర్బీజ సంస్కారం. ఆత్మ అనే ధామం వ్యుత్థాన సంస్కారంతో మథనపడటానికి కాదనీ, (అయ్యవార్లేం చేస్తున్నారంటే, తప్పులుచేసి, దిద్దుకుంటున్నారన్నట్లుగా) తెచ్చిపెట్టుకున్న వ్యుత్థాన సంస్కారమును నిరోధ సంస్కారాన్ని అలవరచుకుని ఆయాసపడుట కంటే అడుసు త్రొక్కనేల కాలు కడుగనేల? అనే జ్ఞానవిజ్ఞాన పరంగా 'నేను' యొక్క ధామం బుద్ధి చెప్పుకుని, 'బుధ' పదమునకు బుద్ధిని ఆశీర్వదించి, అంగీకరించి, కోరి, తనకు స్థితి కిరణంగా చేసుకుని, అటువంటి కిరణములకు ప్రకాశ స్థానంగా తన బుద్ధిని తీర్చి దిద్దుకుని అలంకరింపబడినదిగా చేస్తున్నాడు. అదే పరమార్థత.

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

12-2.- 1980

"మహాత్ములు ఎప్పుడూ సహజ సమాధిలో ఉంటారు. ఇది నమ్మశక్యమైనదేనంటారా?" అని ప్రశ్నించారు శ్రీ బాబు. "వారికి దేహస్మృతి ఉండదు" అంటూ, శ్రీ బాబు శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారి చరిత్ర చెప్పారు.

"శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు ఒకసారి కేశవా, మాధవా, గోవిందా అని నామస్మరణ చేసుకుంటూ వెళ్తుంటారు. ఆ దారిలోనే ఒక నవాబు వేటకై అరణ్యానికి వచ్చి ఒక గుడారం వేసుకొని బసచేసి ఉంటాడు. శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు సహజ సమాధిలో నామస్మరణ చేసుకుంటూ ఆ గుడారంలో నుంచి వెళ్ళిపోతారు.



నిదురిస్తున్న నవాబుకు మెలకువ వచ్చి, తన గుడారంలోంచి నిర్లక్ష్యంగా వెళ్ళిన ఆ సన్యాసిని వెంబడిస్తాడు. తన ఒరలోంచి కత్తిని దూసి ఆయన చేతిని ఖండిస్తాడు. అయితే శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు మాత్రం చేయి తెగినప్పటికి ఏమాత్రం చలించక, కేశవ నామస్మరణ చేసుకుంటూ వెళ్తాడు.

నవాబు అదిచూసి దిగ్భ్రాంతి చెంది, ఆయన వెంట వెడతాడు. ఏమాత్రం ఇంద్రియ స్పర్శలేకుండా సమాధిస్థితిలో ఉన్న ఈ మహానుభావుడు తప్పక అల్లా అయి ఉంటాడని భావించి, ఆయన వెంబడి వెళ్ళి ఆయనకు ఎదురువచ్చి, ఆయన రెండు పాదములను గట్టిగా పట్టుకుంటాడు. శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు 'వత్సా! నీకు ఏమి కావాలి?' అని అడుగుతారు.

నవాబు పశ్చాత్తాపపడి 'స్వామీ నేను తమరి చేయిని ఖండించాను అపరాధం చేశాను. కాబట్టి నన్ను క్షమించండి' అని వేడుకుంటాడు. దానికి ఆయన 'నాచేయి ఖండించావా! లేదే!' అంటాడు.

నవాబు తాను ఖండించిన చేయిని తనచేత పట్టుకొని 'స్వామీ ఇదిగో నేను ఖండించిన చేయి' అంటాడు. 'అయితే ఆ చేతిని ఎక్కడనుండి ఖండించావో అక్కడే ఉంచు' అంటారు సదాశివ బ్రహ్మేంద్రులు. నవాబు అలా చేయగానే ఆ చేయి అతుక్కుపోయింది. దానిని చూసి నవాబు ఇంకా ఆశ్చర్యపోయి "స్వామీ, తమరు అనుగ్రహించేవరకూ ఈ పాదములను విడువను" అంటాడు.

శ్రీ బాబూజీ చెపుతూ "చూశారా! నవాబు ఆ మహాత్ముని పాదములు స్పృశించుటవలన అహంకార మమకారములనే తెరలు తొలగిపోయి, అజ్ఞానమనే చీకటి జ్ఞానమనే వెలుగులో లీనమైంది. కుడిపాదము స్పృశించుటవలన అహంకారము, ఎడమ పాదము స్పృశించుట వలన మమకారము తొలగిపోయాయి. గురుదేవులు జ్ఞానస్వరూపులు. కాబట్టి వారి స్పర్శ చేతనే వారి శక్తిని శిష్యులు పొందగల్గుతారు. అది స్వీకరించేవారు అదృష్టవంతులు.

విద్యుత్తు ప్రవహించే రాగితీగలో విద్యుత్తు ఉన్నట్లు కనబడదు. దానికి ఒక బల్బు తగిలిస్తే వెలుగుతుంది. ఆ వెలుగు చీకటిని పారద్రోలుతుంది. అజ్ఞాన రహితుడైన నవాబు, శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారి శక్తిని తెలుసుకున్నాడు. నవాబు 'స్వామీ! నాకు ఈ సామ్రాజ్యము వద్దు. ధనధాన్యాలు వద్దు. దీనిలో ఆనందం లేదు. మీరు అనుభవించే ఆనందాన్ని పొందటానికి కావలసిన ఉపాయాన్ని నాకు కూడ ప్రసాదించండి' అని వేడుకుంటాడు. దయార్ద్ర హృదయులైన శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు నవాబుకు మంత్రోపదేశము చేసి తాను తిరిగి వచ్చేవరకు అక్కడే కూర్చొని ఆ మంత్రాన్ని అనుష్ఠానం చేయమంటారు.

ఆ నవాబు అలాగే కాలంతో నిమిత్తం లేకుండా ధ్యానం చేసి, అంతఃకరణ శుద్ధి చెందిన తర్వాత గురుదేవుల దర్శనం లభిస్తుంది. అటువంటి ప్రభువుకి రాజ్యంతో పని ఏముంది? వారికి ధనాశ, రాజ్యకాంక్ష ఉండదు. మోక్ష సామ్రాజ్యాన్ని పొందే వారికి ఈ తాత్కాలికమైన దుఃఖపూరితమైన సామ్రాజ్యాలు ఎందుకు? ఆ నవాబు చివరికి మోక్ష సామ్రాజ్యాన్ని సాధిస్తాడు. మీ స్వధర్మాన్ని నిర్వర్తిస్తూ కూడా ఆత్మానందాన్ని పొందవచ్చు. రాజయోగులు అన్ని సుఖాలనూ అనుభవిస్తూ, భగవంతుని ఆశ్రయించటం చాల గొప్ప విషయం. స్వధర్మం నిర్వర్తించాలి. మనలో

ఉన్న శక్తిని నిర్లక్ష్యం చేయరాదు. అయితే ఈ పని నేను చేస్తున్నాను అనే అహంకారము చాల ప్రమాదకరమైనది. అది నారదుని సహితం భంగపరచింది.

నారదుడు కైలాసంలో ఉన్న పరమశివుని దర్శించి, అక్కడ అందరిచేత పరమభక్తుడని కొనియాడబడిన తర్వాత సంతోషముతో ఉబ్బితబ్బిబ్బైన నారదునిలో 'నా అంత భక్తుడు ఎవరు ఉన్నారు?' అని కొంచెము అహంకారము తలఎత్తింది. అది గ్రహించిన శ్రీమన్నారాయణుడు ఆ సమయంలో ద్వారకలో శ్రీకృష్ణ భగవానుడిగా అవతరించి ఉన్నాడు. నారదుడు ద్వారకకు వెళ్ళి శ్రీ కృష్ణుని మెప్పుకూడ పొందటానికి బయలుదేరతాడు. శ్రీకృష్ణుడు నారదునికి ఎదురువచ్చి స్వాగతం పలుకుతాడు. నారదుడు దానితో ఇంకా ఉప్పొంగిపోతాడు.

నారదుని, శ్రీకృష్ణుడు తన మందిరానికి తీసుకువెళ్ళిన తర్వాత 'నారదా! ద్వారకకు శని పట్టింది. దానిని వదిలించటానికి పరమ భక్తుడవైన నీకే సాధ్యపడుతుంది. ఇక్కడికి సమీపంలో ఒక భక్తుడు వున్నాడట. అందరూ అతడిని పరమభక్తుడు అంటున్నారు. ఒకసారి ఆ భక్తుని దర్శించిరా. నీవు చేయవలసిన కార్యము తర్వాత చెప్తాను' అంటాడు కృష్ణుడు. నారదుడు నా అంతటి పరమభక్తుడికి పెద్ద పెద్ద పనులుచెప్పాలి గాని ఈ చిన్నపని ఏమిటి? అని అనుకొని అయినా తాతగారు చెప్పారు కాబట్టి ఎలాగైనా చేయక తప్పుతుందా అనుకొని ఆ భక్తుని సందర్శించటానికి వెళ్తాడు. నారదుడు సందర్శించిన భక్తుడు, ఒక పర్ణశాలలో నివసించే గొల్లవాడు. నారదుడు వెళ్ళినపుడే నిదురలేచి 'గోవిందా' అని భగవన్నామస్మరణ చేసి కాలకృత్యములు తీర్చుకొని, నాగలి చేతబట్టి, సేద్యానికి వెళతాడు. తిరిగి మధ్యాహ్నం భోజన సమయంలో 'గోపాలా' అని పరమాత్మని ప్రార్థిస్తాడు. అదేవిధంగా రాత్రి నిదురించేముందు తిరిగి 'కృష్ణా ముకుందా' అని భగవంతుడిని ప్రార్థిస్తాడు.

ఇది చూసిన నారదుడు 'ఇతడేమి భక్తుడు? భగవంతుడిని కేవలం నిత్యం మూడు పర్యాయాలు మాత్రం ప్రార్థిస్తున్నాడు. నేను అనుక్షణం నారాయణ మంత్రం జపిస్తున్నాను. నాకన్న అతడేమి భక్తుడు? అంతేకాకుండా ఆ గొల్లవాడు సంసారి, సేద్యం చేసుకుంటున్నాడు. భార్యాపిల్లలతో సంసారం చేస్తున్నాడు. ఇతడేమి భక్తుడు' అని అనుకొని

ద్వారకకు తిరుగు ప్రయాణం చేస్తాడు.

ద్వారకకు తిరిగివచ్చి శ్రీ కృష్ణునితో 'స్వామీ మీరు చెప్పిన భక్తుని సందర్శించాను. అతడు పేద గొల్ల. అతడు కేవలం మూడు పర్యాయాలు భగవంతుడిని నిత్యం ప్రార్థిస్తున్నాడు. అతడేమి భక్తుడు స్వామీ?' అంటాడు.

'అది సరే నారదా! ద్వారకకు శని పట్టింది అని చెప్పాను కదా. అది పోవాలంటే ఒక వ్రతం ఉంది. అది పరమ భక్తుడవైన నీవు ఆచరిస్తేనే ద్వారకకు పట్టిన శని వదులుతుంది" అని శ్రీకృష్ణుడు ఆ వ్రత విధానాన్ని వివరిస్తాడు. 'నారదా నీవు చేయవలసినదల్లా ఒక పాత్రనిండా నూనె తీసుకొని, ఆ పాత్రని శిరస్సున ఉంచుకొని, నా చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయాలి. కాని ఒక చుక్క నూనెకూడ క్రింద పడకూడదు. అలా ప్రదక్షిణలు చేసేటప్పుడు నారాయణ మంత్రం జపించాలి' అంటాడు శ్రీకృష్ణుడు.

నారదుడు అలాగే పాత్రలో నూనె తీసుకొని, శ్రీకృష్ణునిచుట్టూ మూడు ప్రదక్షిణలు చేస్తాడు. అయితే నారదుని మనస్సు, నిజంగానే శనిపట్టినట్లు నూనె పాత్రపైనే లగ్నమయింది. నారాయణ స్మరణ మరచాడు. అహంకారమనే పొర ఆవరించటంవలన నారాయణుడు తొలగి శని ఆవరించాడు. వ్రతం పూర్తి అయిన తర్వాత శ్రీకృష్ణుడు 'నారదా! నియమం తప్పకుండా నారాయణ మంత్రస్మరణ చేశావు కదా!' అంటాడు. వెంటనే నారదునికి కనువిప్పు కలుగుతుంది. అహంకారమనే పొర తొలగింది. శ్రీకృష్ణుని క్షమించమంటాడు.

శ్రీకృష్ణుడు అంతట 'నారదా! బ్రహ్మచారివైన నీవు కేవలం ఒక నూనె పాత్ర భారం వహించినంత మాత్రాన నారాయణుని విస్మరించావు కదా! మరి తన సంసార భారాన్ని మోస్తూ నిత్యకర్మని చేస్తున్న సంసారి అయిన ఆ గొల్ల శ్రీమన్నారాయణుని మరువక ప్రార్థిస్తున్నాడు అంటే నిజమైన భక్తుడు ఎవరు?' అని ప్రశ్నిస్తాడు. చూశారా! రాజయోగం ఎంత గొప్పదో! రాజయోగులు నిత్యకర్మ చేస్తూ భగవంతునికి మనస్సు అర్పణ చేసుకుంటే అంతకన్న ధన్యమైనది ఏముంది?" అన్నారు.

(గత సంచిక తరువాయి) **అమ్మమాట** - జపమాల ప్రసాద

## నిరంతర మథనం చేయాలి

'శ్రవణ మనేది సాధనకి చాలా ముఖ్యం. కానీ వినడమే ఒక రోగం కాకూడదు. మనం ఏదయితే విన్నామో, దానిని బాగా నెమరు వేసుకోవాలి. అంటే, మననం చేయాలి. భావన చేయాలి. అది బాగా జీర్ణించుకోవాలి. అప్పుడు మనం శ్రవణం చేసిన గురుబోధామృతం మన నరనరాలలోనూ ప్రవహిస్తుంది. మనం విన్నదానికి సార్థకత చేకూరేది ఎప్పుడంటే, మనం విన్నది అనుభవానికి తెచ్చుకుని, ఆచరణలో పెట్టిననాడే. భగవంతుని దివ్య చరణారవిందాలను మన హృదయంలో ముద్రించుకోవాలి. మనకా ముద్ర చాలు. ఎక్కడికో వెళ్ళి శాస్త్రాలు పఠించనవసరం లేదు. గురు బోధని నిరంతరం మనస్సులో మథించాలి. మనస్సుతో రాపిడి పెట్టాలి.



***ఆత్మానమరణిం కృత్వా ప్రణవం చోత్తరారణిమ్।***
***జ్ఞాన నిర్మథనా భ్యాసాత్ పాశం దహతి పండితః॥***

అని కైవల్యోపనిషత్ చెబుతోంది. - మనస్సును క్రింది కట్టెగాను, ఓంకారమును పై కట్టెగాను చేసికొని, జ్ఞానమనే మథనం ద్వారా, జ్ఞాని యైనవాడు అజ్ఞాన పాశమును దహించి వేయుచున్నాడని దాని అర్థం.

మనలో ప్రతినిత్యం జరిగే ఈ అగ్నిహోత్రానికి కావలసినవి 'శ్రద్ధ' అనే సమిధలు, శమాది షట్కసంపత్తి అనే సమిధలు. మనలో జరిగే ఈ నిత్య అగ్నిహోత్రానికి బాహ్య వస్తువులతో పనిలేదు. మన చెవులే హోమ కుండాలు, ఈ శ్రవణేంద్రియాల ద్వారా గురుబోధామృతమనే హవిస్సును వేయాలి. తద్వారా ఉత్పన్నమయిన జ్ఞానాగ్ని మన సమస్త కర్మలను రహితం చేస్తుంది. గీతాచార్యుడు చెప్పినది కూడా ఇదే.

ఇటువంటి అభ్యాసం ద్వారా ధ్యానం కుదురుతుంది. మనస్సు ఓంకారంలో లీనమైపోతుంది. జన్మజన్మాంతరాల నుండి మనం వెంట వేసుకుని వచ్చిన పాశములన్నీ ఈ ధ్యానమనే హోమంలో దహింపబడి పోతాయి. సాధన చేయగా చేయగా, జీవుడనే జీవాత్మ పరమాత్మలో లీనమైపోతాడు. మనందరిలోనూ, సకల చరాచర జగత్తు అంతా కూడా

ఒకే ఒక గురుచైతన్యంతో నిండి వున్నది. దాని చేతనే సమస్త జగత్తు ప్రకాశిస్తున్నది. ఆ చైతన్యమే మన నఖ శిఖ పర్యంతమూ వ్యాపించి వున్నది. ఇది గుర్తించాలి అంటే గురుధ్యానం ద్వారానే సంభవం.

'నువ్వు సాధన చేయకుండా, గురుదేవుడు నాకేదో ఇవ్వలేదంటే ఎలా? నువ్వు చేయవలసిన సాధన ధ్యానమే' అని శ్రీ గురుదేవుల వాక్యం. మరొకటి కూడా చెప్పారు శ్రీబాబూజీ మహరాజ్ 'వైరాగ్యమనే రతి ద్వారా, భక్తియనే గర్భాన్ని దాల్చి, జ్ఞానమనే పుత్రుడిని కనాలి' అని. శ్రీగీతాచార్యుడు చెప్పినది కూడా అదే కదా!

*అసంశయం మహాబాహో! మనోదుర్నిగ్రహం చలమ్।*
*అభ్యాసేనతు కౌంతేయ! వైరాగ్యేణచ గృహ్యతే॥*

'మనస్సుని అరికట్టడం చాలా కష్టమైన పనే. అందులో ఏ మాత్రం సంశయం లేదు. కానీ, అర్జునా! అభ్యాసం చేత, వైరాగ్యం చేత దానిని నువ్వు సాధించవచ్చు' అని గీతాచార్యుడు శెలవిచ్చి వున్నాడు.

తీవ్రమైన, గాఢమైన పట్టుదలే వైరాగ్యం అని శ్రీగురుదేవులు చెప్పివున్నారు. 'నిలబెట్టగా, నిలబెట్టగా కోడిగ్రుడ్డే నిలబడుతుందే, మీ మనస్సెందుకు నిలబడదు?' అని శ్రీబాబు మాట. భక్తి, వైరాగ్యము అనే రెండు రెక్కలు బలంగా కలిగిన ఈ జీవుడనే పక్షి, చిటారు కొమ్మమీద వున్న మోక్షఫలాన్ని అందుకోవచ్చు అన్నారు శ్రీబాబు.

ఎవరెన్ని విధాలుగా చెప్పినా సత్యం మటుకు ఒక్కటే. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి' ; 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' అన్నవి బ్రహ్మ సూత్రాలు. జగత్తు మిథ్య ఎలా అయింది? అన్నది విచారణ చేయాలి. అప్పుడే జ్ఞానమనే కాంతిలో వస్తుదర్శనమవుతుంది. జగత్తు సత్యం కాదు - అది మారి తీరుతుంది. జగత్తు బ్రహ్మమయమైనప్పుడు తాను కూడా బ్రహ్మమే అవుతాడు.

ఎన్ని విధాలుగా వెడితే, ఆ భగవానుడు మనకు అందుతాడో, అన్ని విధాలుగా అందించారు మహాత్ములు. భగవంతుడు నావాడు, నాలోనే వున్నాడు అని గుర్తించు. సత్యగురుదేవుని ఆశ్రయించి, వారు మనకు ప్రసాదించిన మార్గములో వారి ఆజ్ఞను తు.చ. తప్పకుండా, అకుంఠిత విశ్వాసంతో మనం ప్రయాణించిననాడు మన గమ్యస్థానాన్ని చేరి తీరుతాము. అట్టి సాధనా సంపత్తిని, అఖండ భక్తిజ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# శ్రీమాతాజీ ఆశ్రమేతర కార్యక్రమాలు

**ఆగస్ట్ 2019లో .........**

1-8-19 - ఢిల్లీ చేరుతారు.

2-8-19 - శ్రీ కాళీవనాశ్రమము, నంబూరు చేరుతారు.

5-8-19 - 12-8-19 వరకు భీమవరం, సోమారామంలో హరేరామనామ సప్తాహం ప్రారంభిస్తారు. సప్తసప్తాహాలలో ఇది నాల్గవ సప్తాహము.

12-8-19 - సప్తాహమునకు మంగళహారతి.

15-8-19 - కట్టమూరులో త్రయాహ్నిక సత్సంగ కార్యక్రమములు.

7-8-19 - సత్సంగ కార్యక్రమాలు పూర్తిఅగును.

**సెప్టెంబర్ 2019లో .........**

8-9-19 - 15-9-19 వరకు పాలకొల్లు క్షీరారామ సప్తాహము ప్రారంభము. సప్తసప్తాహములలో ఇది అయిదవ సప్తాహము.

15-9-19 - సప్తాహమునకు మంగళహారతి.

18-9-19 - హైదరాబాద్‌లో సత్సంగములు ప్రారంభము

22-9-19 - సత్సంగ కార్యక్రమాలకు మంగళహారతి.

24-9-19 - హైదరాబాద్ శాఖ యందు శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం.

---

**శ్రద్ధాంజలి**

శ్రీబాబూజీ భక్తులు, శ్రీమతి చిలువూరి జానకమ్మగారు (హృషీకేశ్ రాజుగారి ధర్మపత్ని) 17-6-2019 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 82 సంవత్సరాలు. వీరు గత కొద్దిరోజులుగా ఆశ్రితాశ్రయాన్ని ఆశ్రయించి వున్నారు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# వేసవిలో శిక్షణా తరగతులు (నివేదిక)

శ్రీ సద్గురుదేవుల దివ్య అనుగ్రహంతో పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ వారి దివ్యాశీస్సులతో "వేసవి శిక్షణా తరగతులు" ది.01.05.2019 న ప్రారంభమై, ది.28.05.2019న ముగిశాయి. 90మంది బాల బాలికలు ఈ తరగతులకు హాజరైనారు. వారి వయస్సు, అవగాహన బట్టి వారిని వివిధ వర్గాలుగా విభజించి శిక్షణ ఇవ్వటం జరిగింది. ఉపాధ్యాయ వర్గం: డా. వి. అరుణ ; ఎన్. బాలా త్రిపుర సుందరి ; ఎన్ రాజేశ్వరి ;ఎమ్ హనుమత్ జయప్రద. ఈ బాల బాలికలకు మే 27, 28 తేదీలలో పరీక్షలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా శ్రీయుతులు సి.వి. రమణబాబు గారు ; ఎమ్. జానకి రామ శాస్త్రిగారు ; ఎమ్. జగన్నాథరాజుగారు వ్యవహరించారు.

1. దైవ ప్రార్థన:Ist. ప్రైజ్ - పి. పార్థ సారథి ;II. వి. హర్షవర్ధన్ ;III .పి గాయత్రి శాంతి.

2. దైవ ప్రార్థన, నారాయణోపనిషత్.
 I. ధాత్రి బృంద ; II. పి. విశాల్ ; III . వి. శ్రీకరి.

3. దైవ ప్రార్థన, నారాయణోపనిషత్, భక్తి యోగం.
I. వై. గోకులకృష్ణ ; II. వి. సాధిక ; III . ఎన్. పూర్ణ కాళీ ప్రసాద్‌బాబు.

4. ఐటమ్ 3లో ఉన్న పాఠ్యభాగాలు, పురుషోత్తమ ప్రాప్తి యోగం, గీతా మాహాత్మ్యం, శివ కవచం, శివ పంచాక్షరి ఉపనిషత్, హనుమాన్ చాలీసా
I. చంద్ర సిద్ధార్థ ; II. ఎన్. ఉజ్జ్వల ; III . కె. కార్తీక్.

5. ఐటమ్ 4లో ఉన్న పాఠ్యభాగాలు, ఆదిత్య హృదయం, స్కందోపనిషత్, పురుష,శ్రీసూక్తాలు.
I. పి. దుర్గా నందిని ; II. డి. తేజోరమ ; III . ఎమ్. చంద్రహాస్.

6. ఐటమ్ 5లో ఉన్న పాఠ్యభాగాలు, గణపత్యుపనిషత్, శ్రీ గురుపాదుకాస్తవం,శ్రీ గురు పాదుకా పంచక స్తోత్రం, లఘుపూజా విధానం, మహా మంత్ర పుష్పం, దశ శాంతులు, కర్మయోగం , భక్తి యోగం(అర్థ తాత్పర్యాలు).
I.డి. ధాత్రి చంద్ర ; II. సి. కళ్యాణ్ (and prize for Tabla playing) ; III .పార్థ సారథి.

7. ధ్యానం : I.వి. రమ్య; II. బి.సుమతి ; III .వి.కిరణ్మయి.

8. శ్రీగురు చరిత్ర : I.ఎమ్. నిత్యానంద కాళీ ప్రసాద్; II. ఎమ్. ధాత్రి; III .డి. దుర్గా చరణ్

9. నామ జపం.: I.పి కోదండ రామ కాళీ ప్రసాద్; II. ఇ. గౌతమ్III .దీక్షిత.

ఈ క్లాసులలో పాల్గొన్న వారందరికీ శ్రీ మాతాజీ వారు ఆశీర్వదించి సర్టిఫికెట్స్ ఇచ్చారు.

# రామాయణంలో స్త్రీ పాత్రలు

## కౌసల్య

- సుషుమ్నా ప్రసాద

విష్ణ్వంశ సంభూతుడైన దశరథ మహారాజు దక్షిణ నాయకుడు. ఆయనకు అనేకమంది సతులున్నారు. కానీ వారంతా అనామికలే. దశరథ మహారాజు రాణులలో చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందినవారు ముగ్గురే. వారు కౌసల్య, కైకేయి, సుమిత్ర.

*సత్యం తపః ధర్మం తపః స్వాధ్యాయ స్తపః* - అనే నిర్వచనానికి ప్రధమోదాహరణ కౌసల్య. ఆమె కోసల రాజ పుత్రిక. కాబట్టి కౌసల్యగా ప్రసిద్ధి చెందినది. అంతేకాదు. ఆమె సార్థక నామధేయురాలు. అందరి కుశలాన్ని కోరేది కాబట్టి ఆమె కౌసల్య. ఎంతో కౌశల్యంతో ప్రవర్తించేది కాబట్టి ఆమె కౌసల్య అనే పేరు నిలబెట్టుకున్నది. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువునే పుత్రునిగా కన్న ఆమె భాగ్యం ఇంతయని వర్ణించడానికి సాధ్యం కానిది. ఎన్ని నోములు నోచినదో, ఎన్ని దానాలు చేసినదో కదా కౌసల్య తల్లి. అమె పురాకృత పుణ్యఫలంగా, శ్రీరామ చంద్రుని పుత్రునిగా పొందిన మహనీయ మాతృమూర్తి, మహాసాధ్వి.

కృతయుగంలో పృశ్ని, పృశ్నిగర్భుడనే ముని దంపతులు మోక్షకాములై, కొన్ని వేల సంవత్సరాలు కఠోర తపస్సు చేసారు. ముందు కంద మూలాలు భుజించారు. తరువాత అవి కూడా విసర్జించి, జల భక్షణ, తరువాత వాయు భక్షణతో జీవించారు. వారి తపస్సుకు మెచ్చి, శ్రీమన్నారాయణ మూర్తి చతుర్భుజుడై శంఖు, చక్ర, గదాధరుడై, తన దివ్య మంగళ స్వరూపముతో, ఆ ముని దంపతులకు ప్రత్యక్షమయినాడు. ఆ అతిలోక సౌందర్యమూర్తిని, ప్రేమ మూర్తిని చూసి, ముని దంపతులు అచ్చెరువొంది, నిశ్చేష్టులై నిలబడిపోయారు! అలా దివ్యమంగళ మూర్తి మధురాకృతిని తనివితీరా చూస్తూ, కొంతసమయానికి తేరుకుని, పృశ్ని 'ప్రభూ! నేను ఒక కోరిక కోరవచ్చా?' అని అడిగింది. 'అందుకే వచ్చానమ్మా! తప్పకుండా నీ కోరిక తీరుస్తానమ్మా! చెప్పమ్మా!' అన్నాడు శ్రీహరి.

'అదిగో! అమ్మా! అని మూడుసార్లు పిలిచావు కదా! ఎంత మధురంగా వున్నదో ఆ పిలుపు. కావున నిన్ను మూడుసార్లు పుత్రునిగా పొందే భాగ్యాన్ని నాకు కలిగించు ప్రభూ!' అని వేడుకున్నది. పృశ్నిగర్భుడు కూడా అదేమాట అన్నాడు. శ్రీ మహావిష్ణువు 'మీ ఇరువురి బలీయమైన కోరికను తప్పక తీరుస్తాను. మూడు జన్మలలో మీకు పుత్రుడనై, తరువాత

మీకు ముక్తిని ప్రసాదిస్తాను' అని అభయమిచ్చి, అంతర్ధానమయ్యాడు.

తరువాత ఆ ముని దంపతులు కృతయుగంలో అదితి, కశ్యపులుగా జన్మించారు. శ్రీహరి వారి గర్భాన వామన మూర్తిగా అవతరించారు. రెండవ జన్మలో కౌసల్య దశరథులుగా జన్మించారు. శ్రీరామచంద్ర ప్రభువుగా వారి గర్భవాసాన శ్రీహరి అవతరించారు. మూడవ జన్మలో ఆ దంపతులు దేవకి, వసుదేవులుగా జన్మించి, శ్రీకృష్ణపరమాత్మకు జననీ, జనకులై తరించారు.

అందుచేత భూలోకంలో కౌసల్య దివ్యమాతగా వర్ధిల్లటంలో ఆశ్చర్యమేమున్నది? పూర్వజన్మ సంస్కారం గల బుద్ధిమంతురాలు కౌసల్య. విష్ణ్వంశ సంభూతుడైన దశరథమహారాజు ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులకు ప్రతీకలు రాణులైన కౌసల్య, కైకేయి, సుమిత్రలు. సాధారణ స్త్రీధర్మంగా ఎన్నో నోములు నోచి, ఎన్నో దానాలు చేసి, ఎంతగానో జపించి, తపించి, తత్ఫలితంగా జగన్నాధుడైన శ్రీరామచంద్రుని తన పుత్రునిగా పొందింది. ఆ చిన్నారి రాముని లాలించి, పాలించి, బుజ్జగించి, హృదయానికి హత్తుకొన్న పరమపావని, సత్శీల, సచ్చరిత కౌసల్యామాత.

ఆ ధన్యజీవి ఇచ్ఛాశక్తికి ప్రతీక. బాల రాముని, బాల క్రీడలను తిలకించి, పరవశించి, తన నోముల పంటను సీతామహాలక్ష్మితో కళ్యాణరామునిగ దర్శించిన కమనీయ దృశ్యాన్ని మదిలో నిలుపుకుని మురిసిపోయింది. ఇక పట్టాభిరామునిగ ప్రసిద్ధి చెందితే తాను రాజమాతగా మన్ననలను పొందాలని ఆశించడంలో ఆశ్చర్యమేమున్నది? అలాంటి పరమ పవిత్ర మూర్తిని పట్టాభిషిక్తునిగా చూడాలని వువ్విళ్ళూరుతూ, ఊహాలోకంలో విహరిస్తున్న తల్లిదగ్గరకు వచ్చి, 'వనవాసానికి వెడుతున్నానమ్మా! ఆనందంతో అనుజ్ఞ ఇచ్చి, ఆశీర్వదించమ్మా!' అన్న పుత్రుని ధీర సౌమ్య వచనాలను విని, ఆ తల్లి నిర్విణ్ణురాలయింది. దిగ్భ్రాంతి చెందించే ఆ వార్తను విని, ఆ తల్లి నిలువునా కుప్ప కూలిపోయింది. పుత్రుడు మంత్రజలాలతో ప్రోక్షించిన తరువాత కొంతసేపటికి తేరుకుని, సేదతీర్చిన తనయునితో 'రామా! పట్టాభిషేకం చూసి పరవశించాలనుకున్న కన్నతల్లికి, ఈ ఘోరవార్త ఏమిటి నాయనా?' అని ప్రశ్నించింది.

-సశేషం

# అహం భావన

- శ్రీ రమణ భగవాన్

ఒక రోజున శాస్త్రిగారు శ్రీరమణులను సమీపించి, 'స్వామీ! పంచాక్షరిగాని, అష్టాక్షరి మంత్రంగాని జపిస్తున్నవారు జారత్వ చోరత్వ సురాపానాదులు చేసిన ఈ దోషాలు ఆ మంత్ర జపం వల్ల హరింప బడగలవా?' అని అడిగాడు.

"నేను జపిస్తున్నాను అనే భావం లేకుంటే వీటివల్ల కలిగే దోషం వారికంటదు. 'నేను జపిస్తున్నాను' అనే భావన వున్నప్పుడు, దురభ్యాసం వలన కలిగే పాపం మాత్రం ఎందుకంటదు?" అన్నారు శ్రీరమణులు.

'ఈ పుణ్యం, ఆ పాపాన్ని హరించదా?' అని అడిగారా శాస్త్రిగారు.

"నేను చేస్తున్నాననే అహం భావన వున్నంతవరకూ దేనికది అనుభవించవలసినదే. ఒకదానితో వేరొకటి కప్పిపుచ్చటం ఎలా పొసగుతుంది? నేను చేస్తున్నాననే భావన పోయినప్పుడు తనకేదీ అంటదు. తానెవరో తెలుసుకుంటేగానీ, నేను చేస్తున్నాననే భావన పోదు. తన్ను తాను తెలుసుకున్న వానికి జపమేది? తపమేది?

ప్రారబ్ధవశంగా శరీర యాత్ర సాగుతుందేగాని, అట్టివాడు దేనినీ కోరడు. ప్రారబ్ధం అనేది ఇచ్ఛా ప్రారబ్ధం, అనిచ్ఛా ప్రారబ్ధం, పరేచ్ఛా ప్రారబ్ధం అని మూడు విధాలు. తన్నుతానెరిగిన తత్త్వవేత్తకు ఇచ్ఛా ప్రారబ్ధం లేనేలేదు. అనిచ్ఛా, పరేచ్ఛా రెండే వుంటాయి. వారు ఏది చేసినా పరుల కొరకే. ప్రారబ్ధానుసారం చేయవలసిన పనులుంటే చేస్తారుగాని, తత్ఫలితం వారిని అంటదు. అటువంటివారు ఏది చేసినా పుణ్య పాపములు లేవు. అయితే వారెప్పుడూ లోకాన్ననుసరించే నడుస్తారుగాని అవకతవక పనులు చేయరు" అని యుక్తియుక్తముగా సెలవిచ్చారు శ్రీరమణులు.

# నిత్య సాధన

- మురళీ

ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ, ఆత్మసాక్షాత్కారాన్ని, మోక్షాన్ని పొందాలనుకునేవారు సదా ఆధ్యాత్మిక చింతనలోనే వుండాలి. గురుదేవులు శ్రీబాబూజీ మహారాజ్ 'నామ జపం తైలధారవలె జరగాలి' అని ఎప్పుడూ చెబుతూ వుండేవారు. తైలం ధారగా పడుతున్నప్పుడు, బిందువుకు బిందువుకు మధ్య ఖాళీ (దూరం) వుండదు. అదే విధంగా నామం జరుగుతూ వుండాలి. మనం నడుస్తున్నా, కూర్చున్నా, ఏదైనా పని చేస్తున్నా మనసు గురు పాదములపై లగ్నం చేసి, నామం చేసుకుంటూ వుండాలి. శ్రీగురుదేవులు 'నీ ఎడమచేతిని నా పాదాలపై వుంచి, కుడి చేతితో నిత్యకర్మలు ఆచరించుకుని, అవి పూర్తి అవగానే ఆచేతిని కూడా తెచ్చి నా పాదాలకు చేర్చి ప్రార్థన చేసుకో' అని ఎప్పుడూ చెబుతూ వుండేవారు కదా! ప్రయత్నం చేస్తే అలావటవుతుంది.

కేవలం నామ జపం చేస్తే సరిపోతుందా? దానికి తోడు మనం చేసే కర్మలు కూడా సత్కర్మలు అయి వుండాలి కదా! ఉదయం నుంచి సాయంత్రం వరకు మనం ఆచరించే ప్రతి కర్మలోనూ సద్గురుదేవుల బోధను జ్ఞప్తికి తెచ్చుకుని, వారు చెప్పినట్లుగా ఆచరించే ప్రయత్నం చెయ్యాలి. మనం నిత్యం చేసుకునే ప్రార్థనలోని అంశాలను ఆచరణలో పెట్టుకోవాలి. మొక్కుబడిగా ప్రార్థనను చదువుకోవడం కాదు. మనం మాట్లాడే ప్రతిమాట సత్యమైనదిగా వుండాలి. మనం చెప్పేదొకటి, చేసేదొకటి కాకూడదు. చాలామంది 'నేను చెప్పిందే చేస్తాను' అని చెప్పటం చాలదు, ఆచరణలో చూపించాలి. గాంధీ మహాత్ములు ఏం చెప్పారంటే, 'నేను చేసి, అనుభవించినదే మీకు చెబుతున్నాను' అనేవారు. ఇతరులకు ఆదర్శప్రాయంగా, మార్గదర్శకులుగా వుండేవారు.

అంతేకాకుండా మన మాట సున్నితముగా, పవిత్రంగా వుండాలి. అంతేకాని ఇతరులను బాధపెట్టేటట్లుగా వుండకూడదు. మనస్సు నిర్మలంగా వుంచుకుంటే మనకే ప్రశాంతంగా వుంటుంది. ఇతరులను బాధ పెట్టటం వలన వారి మనస్సు, మన మనస్సు కూడా కలత చెందుతాయి. దాని వలన వారి సాధన, మన సాధనకు కూడా భంగం కలుగుతుంది.

శ్రీ బాబూజీ భక్తకుటుంబం లోని భక్తులంతా ఏక కుటుంబంగా వుంటున్నాము. ఎవరికి ఏ కష్టం వచ్చినా, అవసరం వచ్చినా అందరమూ ఏకమై ఆ భారాన్ని పంచుకుని, ఏక మనస్కులై వుంటున్నాము. దీనినే

శ్రీమాతాజీ 'మీ అందరిలో నాకు గురుదేవులే కనిపిస్తున్నారు. శ్రీ గురుదేవులే ఇన్ని రూపాలలో వున్నారు' అంటూవుంటారు. మనం అందరం శ్రీగురుదేవుని ప్రతిరూపాలై వుండి, చివరిగా శ్రీగురుదేవులలోనే లయిస్తాము. ఇందులో సందేహం లేదు. మన నిత్య ప్రవర్తన ఈ భావనకు అనుగుణంగా వుండాలి. ఎవరు ఏమి చెప్పినా దానిలో మంచిని మాత్రమే స్వీకరిస్తే మన సాధన సవ్యంగా సాగటమే కాకుండా, అభివృద్ధి చెందుతుంది. ఇతరులలోని అవగుణాలు, చెడు ప్రవర్తన మనం మరచిపోయి, వారిలోని మంచినే మనం స్వీకరించిన రోజున మన ఆధ్యాత్మిక సాధన ఎంతో పురోగతి చెందుతుంది. దూషణ, నివృత్తి మార్గాలలో నడిచేవారు కూడా మన ఆచరణకు బద్ధులై సత్ప్రవర్తన అలవరచుకుంటారు.

భగవంతుడు మనందరిలో వున్నాడని నమ్ముతున్నాం కదా! అంటే మన స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు అందరిలోనూ భగవంతుడు వున్నట్లే కదా! మన గృహంలోను, చుట్టుప్రక్కల వున్నవారిలో భగవంతుని దర్శించి, వారికి అదే విధంగా సేవలు అందిస్తూ, వారి ప్రేమను మనం పొందగలిగితే మన జీవితం ఆనంద మయమే కదా! మన గృహం స్వర్గధామమే కదా!

తల్లిదండ్రులు పరమ పూజ్యనీయులు. వారిని దైవస్వరూపంగా భావించి మనస్ఫూర్తిగా భక్తి భావనతో సేవ చేసిన వారికి పుణ్యలోకాలు ఖచ్చితంగా లభిస్తాయి. వారికి వేరే దైవ చింతన కూడా అవసరం లేదు. స్త్రీకి భర్త, అత్తమామలు పరమ పూజ్యనీయులు. వారిని దైవ స్వరూపంగా ఎంచి సేవ చేసుకున్న స్త్రీకి ఉత్తమ గతి తప్పక లభిస్తుంది. ఇవి శ్రీగురుదేవులు చెప్పిన మాటలు. మన ఆంధ్రదేశంలో 'ఇంట గెలచి, రచ్చ గెలవండి' అనే నానుడి వుంది. అదే విధంగా ముందు మన ఇంటిలో వారిలో దైవత్వాన్ని చూడగలిగితే, మిగిలిన వారిలో దైవత్వాన్ని చూడటం తేలికగా అలవాటవుతుంది. మన నిత్య కర్మలలో జాగరూకత వహించి, సదా భగవచ్చింతనతో ఆచరణలో పెట్టుకుంటేనే మనం ఆధ్యాత్మిక సాధన సరియైన మార్గంలో నడుస్తుంది. అప్పుడే మన 'నిత్య సాధన' సత్ఫలితాన్ని ఇస్తుంది.

# తిరునీలకంఠ నాయనారు

- కీ.శే. మద్ది నాగేశ్వరరావు

ఒకప్పుడు చిదంబరంలో తిరునీలకంఠ నాయనారు అనే శివభక్తుడు వుండేవాడు. ఆయన కుమ్మరివాడు. నిత్యమూ శివ యోగులను సేవించుకుంటూ, వారికి మట్టి భిక్షా పాత్రలను దానం చేస్తూ వుండేవాడు. ఆయన ధర్మపత్నీ అన్నివిధాల అర్హురాలు. అందుచేత వారి సంసారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది.

ఎంతటివాడైనా ఒకొక్కసారి కామినీ పాశంలో తగులు కుంటారు. ఒకసారి నాయనారు ఓ రాత్రి ఒక వారకాంత ఓరచూపుల్లో చిక్కి, ఆమె ఆలింగన సౌఖ్యంలో తేలియాడి తెల్లవారుఝామున ఇంటికి చేరాడు చరచరా. అతని ఇల్లాలు అతనిపై వున్న మదన క్రీడ చిహ్నాలను గుర్తించి, ఆగ్రహంతో భర్తతో దేహ సంబంధానికి మాత్రం విముఖురాలై వుంటోంది. ఇలా కాలం జరుగుతోంది.

నాయనారు ఒకరోజున మరులు ఆపుకోలేక భార్య వద్దని వారిస్తున్నా వినక భార్యను పట్టుకోబోయాడు. ఆమె రౌద్రాకారం దాల్చి, 'మమ్మల్ని తాకితే నీలకంఠుని మీద ఆన' అని శపథం చేసింది. శివునిపై శపథం వినగానే నాయనారు మదన జ్వరం విరిగి పోయింది. ఆనాటి నుండి భార్యను తల్లిగా చూస్తున్నాడు. 'మమ్మల్ని' అంటూ బహువచనం ఉపయోగించినది కనుక స్త్రీలందరినీ తల్లులుగానే చూస్తున్నాడు. కాలం దొర్లిపోతోంది. కాలంతోపాటు వారి భక్తి వర్ధిల్లుతోంది. వారిద్దరూ ముసలివారయ్యారు.

ఒక ముహూర్తాన కౌపీనము, విభూతి, జడలతో, భిక్షాపాత్ర ధరించి చిరునవ్వుతో ఒక శివయోగి నాయనారు ఇంటికి వచ్చాడు. పూజలందుకుని తిరిగి వెడుతూ, శివయోగి తన భిక్షాపాత్రను జాగ్రత్త పరచవలసినదని, తాను తిరిగివచ్చి తీసుకుంటానని చెప్పి నాయనారు చేతికి అందిస్తూ -'ఓ భక్తుడా! ఈ భిక్షాపాత్ర సామాన్యమైనది కాదు. దీనికి ఈడైనది ఈ లోకంలో లేదు. స్వర్ణరత్నాదులకంటె ప్రీతిపాత్రమైనది. కడు జాగ్రత్త సుమా!' అని హెచ్చరించి వెళ్లిపోయాడు.

కొన్నాళ్లకు శివయోగి తిరిగి వచ్చి తన భిక్షాపాత్రను ఇమ్మని అడిగాడు. నాయనారు ఆ భిక్షాపాత్రకై లోపలికి వెళ్లి ఎంతసేపటికి తిరిగి రావటం లేదు. శివయోగి ఆగ్రహంతో రంకెలు వేస్తున్నాడు. నాయనారు

గడగడ వణుకుతూ వచ్చి, 'స్వామీ! అపరాధం క్షమించాలి. తమరి పాత్ర కనబడటం లేదు. అంతకంటె మంచి పాత్ర మీకిస్తాను' అని వేడుకున్నాడు. 'ముందే చెప్పాను. నీవు బంగారంది ఇచ్చినా నేను అంగీకరించను. ధూర్తుడా! నా పాత్రను అపహరించావు' అంటూ తిడుతున్నాడు శివయోగి. 'నేను అసత్యవాదిని కాదు. ఏ ప్రమాణం చేయమన్నా చేస్తాను' అంటూ ప్రార్థిస్తున్నాడు నాయనారు. 'అయితే నీ కుమారుని చెయ్యి పట్టుకుని చెరువులో మునిగి ప్రమాణం చెయ్యి' అన్నాడు శివయోగి. 'స్వామీ! నాకు కుమారులు లేరు. మరొక ప్రతిజ్ఞ ఆజ్ఞాపించండి' అన్నాడు. 'సరే నీ ఇల్లాలి చెయ్యి పుచ్చుకుని మునిగి ప్రమాణం చెయ్యి' అన్నాడు శివయోగి. 'అయ్యో! నా భార్యని ముట్టనని శివుని మీద ప్రమాణం చేశాను! ఇప్పుడెట్లా?' అన్నాడు నాయనారు.

'వంచకుడా! చెప్పిన ప్రతిన చేయవు. పాత్రను ఇయ్యవు. ఏమి నీ కపటము! ఏమి నీ వైరాగ్యము! పద - శివ దీక్షితుల సభకు! అక్కడ తేలుస్తాను' అన్నాడు శివయోగి.

కనకసభలో మూడువేల మంది శివదీక్షాపరులు సభతీర్చి వున్నారు. శివయోగి తన అభియోగాన్ని చెప్పాడు. వారిద్దరి వాదనను విని 'నాయనారు భార్య చెయ్యి పుచ్చుకుని నీట మునగవలసినదే' అని తీర్పు చెప్పారు. నాయనారు వేలాదిమంది చూస్తూ వుండగా భార్య చేతికి ఒక కఱ్ఱ పుల్లను ఇచ్చి, రెండవ వైపు పుల్లను తాను పట్టుకుని అందరూ చూస్తూ వుండగా నీటిలోకి దిగాడు.

కఱ్ఱ పట్టుకోరాదని, భార్య చెయ్యి పట్టుకోవాలని శివయోగి అభ్యంతరం చెబుతున్నాడు. నాయనారు తన శపథాన్ని అందరికీ ఎలుగెత్తి చెప్పి, అందరూ చూస్తుండగా భార్యతో కలసినీళ్లలో మునిగి తేలాడు. అద్భుతం! నాయనారు, భార్య కూడా నవయౌవనులై బయటకు వచ్చారు. దివ్యతేజస్సుతో వెలిగిపోతున్నారు! ఈ అద్భుతాన్ని కళ్ళారా చూసిన వేలాది మంది నేత్రాలు శివయోగి కోసం వెతికాయి. శివయోగి అదృశ్యమయ్యాడు!

అందరూ వింటూ వుండగా అశరీరవాణి ఇలా పలికింది. నాయనారు నా భక్తుడు. పరీక్ష కోసం ఇలా చేశాను. ఓ పుణ్య దంపతులారా! చిరకాలం భూలోకంలో సుఖాలు అనుభవించి, నా లోకం చేరండి!' అని.

# మోక్షార్హత

- పి. శేషాద్రి

అవంతీ నగరంలో ఒకే వయస్సుగల ఇద్దరు బ్రాహ్మణ యువకులు వుండేవారు. వారిద్దరూ ఎంతో అన్యోన్యంగా వుండేవారు. అయితే వారి నడవడికలో మటుకు చాలా తేడా వుండేది.

ఒకడేమో దైవభక్తి పరాయణుడు, నీతిమంతుడు. ఎప్పుడూ దైవపూజ, జపాలు చేస్తూ వుండేవాడు. సాయంకాలం భజన చేసేవాడు. వాడి ధోరణి చూసి అందరూ వాడిని దేవదాసు అని పిలిచేవారు.

రెండవవాడు ఎప్పుడూ వేశ్యల ఇళ్ళ చుట్టూ తిరుగుతూ సుఖ భోగాలతో కాలం గడుపుతూ వుండేవాడు. ఇహ వాడికి వేశ్యాదాసు అనే పేరు పడిపోయింది.

వీళ్ళిద్దరూ పైకి ఇలా వున్నా, వీళ్ళ మనస్సులు ఎలా వుండేవంటే, దేవదాసు ఎప్పుడూ మనస్సులో 'ఆహా! వాడు చక్కగా సుఖపడి పోతున్నాడు! ఆ వేశ్యలతో శారీరిక సౌఖ్యం అనుభవిస్తున్నాడు. నాకు ఒక్క సుఖమూ లేదు కదా!' అని కుళ్ళిపోతూ వుండేవాడు.

ఆ వేశ్యాదాసు ఎప్పుడూ మనస్సులో 'ఆహా! నా స్నేహితుడు ఎంత చక్కటి పుణ్యజీవితం గడుపుతున్నాడు! చక్కగా వాడికి మోక్షం వస్తుంది కదా! ఇంద్రియాలను ఎంత గొప్పగా జయించగలిగాడు! మనస్సును ఎలా నిగ్రహించగలిగాడో కదా!' అని లోపల తలస్తూ వుండేవాడు.

కొంతకాలానికి ఇద్దరూ మరణించారు. యమదూతలు వచ్చి, దేవదాసును నరకానికి, విష్ణుదూతలు వచ్చి వేశ్యాదాసును వైకుంఠానికి తీసుకుని పోయారు.

అది చూసిన దేవదాసు 'అయ్యో! ఇదేమి ఘోరము! ఆ వేశ్యాలోలుడికి మోక్షము, నాకు నరకమూనా!' అని వాపోయాడు. దానికి యమభటులు 'ఏం చేస్తాం? నీ మనస్సు ఎప్పుడూ వేశ్యల మీదనే వున్నది. అతని మనస్సు ఎప్పుడూ నీవు ఆచరించే పుణ్యకార్యాలమీద దానివల్ల కలుగబోయే మోక్షం మీద వుండేది. ఆత్మశుద్ధి ముఖ్యంగాని, శరీరంతో చేసే పనులు ముఖ్యం కాదు' అని సమాధానం చెప్పారు.

**దేవుడు కట్టెలోనో, రాతిలోనో, మట్టిలోనో లేడు సుమా! మన బుద్ధిలోనే వున్నాడు! అన్నింటికీ ఆ బుద్ధే మూలకారణం! అదే మోక్షానికి అర్హత!**

# శ్వేత వస్త్రం

- పాలూరి ప్రసాద్

బుద్ధ భగవానుడు సిద్ధార్థుడిగా అవతరించే ముందు బోధిసత్త్వుడిగా అనేక జన్మలు ఎత్తాడని, ఆయా జన్మలలో సాధనకు అవసరమైన ఒక్కొక్క గొప్ప విషయాన్ని నేర్చుకున్నాడని జాతక కథలలో చెబుతారు. అటువంటి జన్మలలో ఒకసారి బోధిసత్త్వుడు ఒక సన్న్యాసిగా జన్మించాడు. ఆయన ఒక అడవిలో నడచి వెడుతుండగా ఒక ఆటవికుడు అక్కడ తటాకంలో దిగి, హాయిగా ఈత కొడుతూ అందులోని కమలాలను విచ్చలవిడిగా తుంపివేస్తూ ఆడుకుని బయటకు వెళ్ళి పోయాడు. ఇది గమనించిన బోధిసత్త్వుడు ఆ తటాకంలోని ఒక కమలానికి ఆకర్షితుడై వంగి దాని సువాసనను ఆఘ్రాణించాడు.



ఇంతలో ఆ తటాకానికి రక్షకుడైన యక్షుడు భీకర స్వరంతో హెచ్చరించాడు ...'ఓ సన్న్యాసీ! ఈ పుష్పం యొక్క సువాసనను దొంగిలించే అధికారం నీకు ఎవరిచ్చారు? ఎందుకు ఇంతటి అపరాధానికి ఒడికట్టావు?' అని.

అందుకు బోధిసత్త్వుడు ఆశ్చర్యంతో 'ఓ యక్షరాజా! నా కళ్ళ ముందే ఆ ఆటవికుడు అంతటి విధ్వంసం సృష్టించినా మాట్లాడని నీవు కేవలం పుష్పం వాసన చూసినందుకే నేనేదో పెద్ద నేరం చేసినట్లు మాట్లాడుతున్నావే? ఇదేం న్యాయం?' అని ప్రశ్నించాడు.

దానికి ఆ యక్షుడు సమాధానం ఇస్తూ 'ఆ ఆటవికుడు అజ్ఞాని. అలా ప్రవర్తించడం అతని స్వభావం. కానీ సర్వసంగ పరిత్యాగం చేసి, సన్న్యాసివైన నీవు మళ్ళీ ఒక పువ్వు వాసనకు లోబడిపోవడం ఎంతవరకు సమంజసం? మురికి పట్టిన వస్త్రం మీద కొత్తగా ఎంత పెద్ద మరకైనా కనిపించదు కదా! అదే స్వచ్ఛమైన తెల్లని వస్త్రంపై ఏ చిన్న మరక పడినా స్పష్టంగా కనిపిస్తుంది. అలా ఏ చిన్న మరక లేకుండా వుండగలిగిన నిర్మలాంతఃకరణను సాధించు!' అని బోధించాడు.

## శ్రీ బాబూజీ మహరాజ్ అనుగ్రహముతో
## శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పర్యవేక్షణలో జరుగనున్న 'హరేరామ నామ సంకీర్తన, సత్సంగ సప్త సప్తాహాలు'

పైన వివరించిన కార్యక్రమాలు శ్రీఅన్నవరం శ్రీ సత్యదేవుని సమక్షంలో ప్రారంభమై, పంచారామాలలో సప్తాహములు చేసుకుని చివరిగా శ్రీకాళీవనాశ్రమంలో సంపూర్ణం చేయబడతాయి. ఈ విషయం భక్తులందరికి కరపత్రములు (పేంప్లెట్స్) ద్వారా తెలియపరచటమైనది.

కార్యక్రమ వివరములు : తె జా 4 గం.లకు సుప్రభాతం; 4గం 30 ని.లకు ప్రార్ధన; 9గం.లనుండి 10 గం.ల వరకు శ్రీశ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనము;11 గం.లకు మరియు సాయంత్రం 6 గం.లకు శ్రీ మాతాజీ మరియు మహాత్ముల అభిభాషణము ఉంటాయి. ఈ సప్తాహాలలో అఖండ హరేరామ నామ సంకీర్తన శ్రీ శివాజీ, కామేపల్లివారి ఆధ్వర్యంలో జరుగును.

సప్త సప్తాహముల వివరములు : 1. ది.23.3.2019 నుండి ది,30.3.2019 వరకు అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ; *2. ది. 24.04.2019 నుండి ది. 01.05.2019 వరకు చాళుక్య కుమారారామం, శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామి, సామర్లకోట;* 3, ది. 20.05.2019 నుండి ది.27.05.2019 వరకు భీమారామం, మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ద్రాక్షారామం ; **4. ది.05.08.2019 నుండి ది.12.08.2019 వరకు సోమారామం, ఉమాసోమేశ్వర జనార్ధనస్వామివార్ల దేవస్థానం భీమవరం;** 5. ది.08.09.2019 నుండి ది.15.09.2019 వరకు క్షీరారామం, శ్రీ పార్వతీ సమేత క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, పాలకొల్లు; 6.ది.18.10.2019 నుండి ది.25.10.2019 వరకు అమరారామం, శ్రీ బాలా చాముండేశ్వరి సమేత శ్రీ అమరేశ్వరస్వామి ఆలయం ప్రాంగణం అమరావతి; మరియు 7. ది.15.11.2019 నుండి ది.22.11.2019 వరకు శ్రీగురు ఆరామం, శ్రీ కాళీవనాశ్రమం (నంబూరు)లో నిర్వహించబడును.

భక్తులందరూ బహు సంఖ్యాకంగా విచ్చేసి, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయమని ప్రార్ధిస్తున్నాము. భారీ ఎత్తున జరిగే ఈ కార్యక్రమాలు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినవి. కావున భక్తులు ఈ విషయాన్ని గుర్తించి, ధన రూపంలోను, అమూల్యమైన సేవలరూపంలోను తమ సహాయ సహకారాలను అందించమని భక్తులను ప్రార్ధిస్తున్నాము. భక్తులు ఇచ్చే విరాళాలకు ఐ.టి యాక్ట్ 80 జి రాయితి లభిస్తుందని తెలియజేస్తున్నాము.

పూర్తి వివరాలకు ట్రస్ట్ ఆఫీస్ 0863 - 2293564;
కె.మురళీమోహన వర్మ సెల్ - 93983 34345 మరియు
కుమార స్వామి రాజా సెల్ - 93465 35357లను సంప్రదించగలరు.

# మనసును నియంత్రిచడం ఎలా?

-రమణ ప్రసాద్

(శ్రీ మాతాజీ ప్రసంగాల నుండి)

సాధకుడైనవాడు మనస్సును నియంత్రించటం నేర్చుకోవాలి. టి.విలలో వచ్చే విజ్ఞాపనలు చూసి కొత్త కొత్త మోజులకు పోతున్నాము. మనోప్రాబల్యం ఎలా ఉంటుందో చూద్దాం : 'మాకీ ఇల్లు నచ్చటం లేదండీ' అంటారు. 'ఏమమ్మా ఇల్లు బాగానే ఉంది కదా!' అంటే, 'మా తమ్ముడికి నచ్చటం లేదండీ' అన్నది వారి అమ్మాయి. 'నీకుకూడా నచ్చటంలేదా?' అంటే, 'లేదండీ! ఈ ఇంట్లోకి వచ్చినప్పటినుండి అశుభాలు జరుగుతున్నాయి' అంది. ఇల్లు మార్చాలంటే ఎంత ఎక్స్ట్రా డబ్బు పెట్టుబడి పెట్టాలో ఆలోచించండి.

బలి చక్రవర్తి ఎవరు? ప్రహ్లాదుని మనుమడు. కొన్ని కారణాల వల్ల ఆయన దేవతలను బాధ పెట్టడం జరిగింది. ఆ కారణంగా శ్రీమన్నారాయణమూర్తి వామనావాతారం ఎత్తి బలిని తరింపజేయ వలసివచ్చింది. నారాయణమూర్తికి ఇచ్చిన మాటకోసం బలి రాక్షస గురువైన శుక్రాచార్యుడి మాటను లెక్కచేయలేదు. 'మూడవ పాదం ఎక్కడ పెట్టను?' అంటే, 'నాతల మీద పెట్టమన్నాడు. స్వామి పాదం ఆయన శిరస్సుపైన పడింది. అతనిని పాతాళ లోకానికి పంపి, ఆ లోకానికి కాపాలాకాసే భారం వహించాడు.

సాధనలో పురోగమించాలంటే, మనలో ఉన్న గుణదోషాలను గుర్తించి వాటిని నివారించుకోవాలి. 'నీ వల్ల గుణదోషమేమి శ్రీరామ! నా వల్లనేగాని' అంటాడు శ్రీ త్యాగరాజ స్వామి. ఇక్కడ మన మనస్సులు స్థిరత్వాన్ని పొంది భగవదాయత్తం చెందాయి. ఇది శ్రీగురుదేవులు మనకు ఇచ్చిన మహదవకాశం.

మనస్సు ప్రపంచపరమైతే అది జీవ లక్షణం. మనస్సు పరమాత్మ పరమైతే అది పరమాత్మ లక్షణం. మనస్సు పరమాత్మవైపు తిరిగితే మనస్సు ప్రశాంతత చెందుతుంది. భగవంతుని సత్య స్వరూపాన్ని తెలుసు కోవాలంటే ప్రశాంతత చెందిన మనస్సుతో భగవన్నామం చేయాలి. మనస్సు ఏదో ఒక నామంపైన స్థిరపడి మనకు ఒక తృప్తి, ఆనందం లభిస్తుంది. మన ప్రభువు అనుగ్రహం వలన మనందరికి అట్టి ఆనంద స్థితిని కలుగజేస్తున్నారు. దైవ లక్షణాలను అలవరచుకోవాలి. మనం దైవం

కంటే వేరు కాదు. భగవంతుడు వున్నాడన్న సత్యాన్ని గుర్తించాలి. దైవత్వం బంధ రహితమైనది. శ్రీగురుదేవుల అనుగ్రహంతో సత్యాన్వేషణ చేస్తూ, మన జీవితాలను పునీతం చేసుకోవాలని, అటువంటి శక్తిని, భక్తిని, అఖండ జ్ఞాన సంపత్తిని శ్రీ గురుదేవులు ప్రసాదించెదరు గాక! సుఖీభవ!!

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

**జులై 2019**

12 శుక్ర - తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ

16 మంగళ - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - శ్రీసద్గురుపాదపూజ

27 శని - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

**ఆగస్ట్ 2019**

15 గురు - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ

23 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - శ్రీసద్గురుపాదపూజ.

25 ఆది - శ్రీగురుదశమి - శ్రీసద్గురు పాదపూజ

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, కొనగళ్ళ దాసరథేశ్వర రావు (బెజవాడ రాఘవయ్యగారి కుమారుడు) 27-5-2019 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన దాసరి కృష్ణమూర్తిగారు (భీమవరం నాయుడుగారు) 16-6-2019 ఆదివారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 86 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# చిదంబరేశ్వరుడి ఆజ్ఞ

- కీ.శే. ప్రభాకర శర్మ

చిదంబరంలో ఉమాపతి శివాచార్య అనేపేరుగల ఒక జ్ఞాని వుండేవాడు. ఆయన కవి, పండితుడు కూడా. నిరంతరం అతీత స్థితిలో వుంటూ వచ్చినందున ఆయన జపతపాలు, పూజా పునస్కారాదుల మీద అంతగా శ్రద్ధ చూపేవాడు కాదు. ఆ కారణం వలన ఆయన పట్ల బ్రాహ్మణోత్తములంతా ఆగ్రహం వహించారు. ఎవరో మామూలు వ్యక్తి కూడా కాదు ఆయన, అన్నీ క్షుణ్ణంగా తెలిసినవాడు. అందుచేత వారి ఆగ్రహానికి అవధులు లేకపోయాయి. శివాచార్య తమ గ్రామంలో నివశించరాదనీ, అక్కడి దేవాలయంలోకి కూడా రాకూడదని వారు శాసించారు.

అందుచేత శివాచార్య ఆ గ్రామం వెలుపల మిట్ట ప్రదేశంలో ఒక చిన్న కుటీరం నిర్మించుకుని అక్కడ నివశించసాగాడు. సాంబుడు అనే ఒక హీన కులస్థుడు ఆయనకు అండగా వుండి, కావలసిన వస్తువులన్నీ తెచ్చి యిచ్చేవాడు. ఒక రోజున సాంబుడు నెత్తిమీద కట్టెల మోపు పెట్టుకుని గుడిసె వైపు వస్తూ వుండగా, దేవాలయం పూజారి వేషంలో పరమేశ్వరుడు ఎదురు వచ్చాడు. ఒక తాటాకు మీద ఏదో శ్లోకం వ్రాసి, సాంబుడి చేతికిచ్చి, దానిని శివాచార్యకు ఇమ్మన్నాడు. ఆ తరువాత పరమేశ్వరుడు అంతర్ధానమయ్యాడు.

సాంబుడు దాన్ని శివాచార్యకు ఇవ్వగా, ఆయన దానిని చదివి, హర్షపులకాంకితుడయ్యాడు. చిదంబరేశ్వరుడు భక్తులకు భృత్యుడని, ఆ శ్లోకంలోని మొదటి పాదంలో వ్రాయబడినది. కుల వివక్షతో నిమిత్తం లేకుండా, ప్రజలు యావన్మందీ ఆశ్చర్యపడే విధంగా, ఆ సాంబుడికి దీక్ష ఇవ్వడం శివాచార్య కర్తవ్యమని పరమేశ్వరుడు ఆ శ్లోకం ద్వారా వుద్బోధించాడు.

శివాచార్య దానిని చదివి ఆనందపరవశుడైనాడు. చిదంబరేశ్వరుడి ఆజ్ఞ ప్రకారం ఆయన ఆ సాంబుడికి సన్న్యాస దీక్ష ఇచ్చాడు. తరువాత నయన దీక్షను కూడా ఇచ్చాడు. ఆ వెంటనే సాంబుడు దివ్యజ్యోతిలో లీనమయ్యాడు. శివాచార్య పరమానంద భరితుడయ్యాడు. ఆ సాంబుడి విజ్ఞానమెట్టిదో అప్పుడుగాని ఆయనకు అవగతం కాలేదు.

శివాచార్య అంటే గిట్టనివారు ఈ సంఘటనను వక్రంగా చిత్రించి, తమ పగ తీర్చుకోవాలని ప్రయత్నించారు. సాంబుడు ఏదో

స్వల్పమైన తప్పుచేస్తే అందుకుగాను అతడిని శివాచార్య సజీవంగా తగులబెట్టాడని వాళ్ళు రాజుకు ఫిర్యాదు చేశారు. సపరివారంగా రాజు కదలివచ్చాడు. చిదంబరేశ్వరుడు పంపిన శ్లోకాన్ని రాజుకు చూపించాడు శివాచార్య. ఆ తరువాత జరిగినదంతా పూసగుచ్చినట్లు రాజుకు చెప్పాడు. రాజు విస్తుపోయి, 'అయితే ముండ్ల పొదకు కూడా మోక్షాన్ని సంప్రాప్తింపజేయగలరా?' అని అడిగాడు. 'సందేహమెందుకు రాజా!' అన్నాడు శివాచార్య. ఆ పొదకు నయనదీక్ష ఇవ్వగానే అది దివ్యజ్యోతిలో లయించిపోతుంది.

రాజుకు ఇదంతా వింతగా, మాయగా తోచింది. 'శివాచార్యా! చిందబరేశ్వరుడు నీకు ఏదో శ్లోకం వ్రాసి పంపించాడన్నావుగా? అక్కడికే వెళ్ళి అడుగుదామా?' అన్నాడు. తను దేవాలయంలోకి ప్రవేశించరాదనే ఆంక్ష సంగతి శివాచార్య ప్రస్తావించాడు. తన వెంట వస్తున్నందువల్ల ఫరవాలేదన్నాడు రాజు. తరువాత వారిద్దరూ కలసి నటరాజు ఆలయంవైపు నడిచారు.

ఈ సంగతి తెలిసిన పండితులు, ప్రజలు, అతడి విరోధులు అందరూ ఆ ఆలయం వద్ద గుమిగూడారు. శివాచార్యకు దైవ సన్నిధిలో శిక్ష తప్పదని అతని విరోధులు ఎంతో ఆశతో ఎదురు చూడసాగారు. ప్రభువు వచ్చిన సందర్భంగా పూజారులు చిదంబరేశ్వరుడికి మంగళ హారతి ఇచ్చారు. నటరాజు విగ్రహానికి ఇరువైపుల సాంబుడు, ముండ్లపొద ఆ వెలుగులో అతి స్పష్టంగా కనిపించాయి. పండితుల గుండెలు గుభేలుమన్నాయి. భయకంపితులై శివాచార్య పాదములపై పడి క్షమాభిక్ష అర్థించారు. అటుపిమ్మట వారందరూ కలసి శివాచార్యను భక్తిప్రపత్తులతో తమ గ్రామంలోకి తీసుకువెళ్ళారు.

***మనస్సు చేసే మాయాజాలమే అన్ని సంకటాలకు మూలము. భౌతిక వాసనల నుండి మనస్సు వికర్షింప బడాలంటే భగవానుడి పాదపద్మాల చెంత మోకరిల్లటం వినా మార్గాంతరం లేదు.అప్పుడే ఈ ప్రాపంచిక వాసనలు ఎంత స్వార్థమైనవో తెలుస్తుంది.***

- శ్రీ కాళీ బాబు

# బుద్ధిర్ యస్య - బలం తస్య

- గాలి జగదీశ్

అడవిలో సింహము జంతువులన్నిటికీ రాజు. అది అందరికీ తెలిసినదే. అది అడవిలో అన్నిటినీ భయపెడుతూ, దానికి ఆకలిగా వున్నప్పుడు, ఏ జంతువు ఎదురుగా కనబడితే దానిని వెంటాడి చంపి తినేస్తుంది. అందుకనే అడవిలో జంతువులన్నీ సింహాన్ని చూడగానే భయపడిపోతూ వుండేవి.

ఒకరోజు అడవిలోని జంతువులన్నీ సమావేశమై, సింహం వద్దకు వచ్చి, 'ప్రతిరోజూ మాలో ఒకరు వంతులవారీగా మీ దగ్గరకు వచ్చి నీకు ఆహారంగా సమర్పించుకుంటాము. కాబట్టి మీరు మాకై వేటాడి భయ పెట్టవలసిన పనిలేదు' అని చెప్పి ఒక నిర్ధారణకు వచ్చాయి. దానికి ఆ సింహము అంగీకరించింది. అలా కొన్ని రోజులు గడిచాయి.

ఒకరోజు కుందేలు వంతు వచ్చింది. అది వుండే స్థలానికి ప్రక్కనే ఒక చిన్న గుడి వుంది. ఆ కుందేలు పూర్వజన్మ సంస్కార బలం చేత అది ప్రతి రోజూ భగవంతుడికి ఒక పుష్పం సమర్పించుకునేది. అలా చేసినప్పుడు దానికి మనస్సులో ఏ సంకల్పం వస్తే ఆ ప్రకారం ఆరోజు నడుచుకునేది. అలాగే దీని వంతురోజు కూడా అది భగవంతునికి పుష్పం సమర్పించుకుని సింహానికి ఆహారంగా వెళ్ళింది. అప్పుడు దానికి ఒక ఆలోచన వచ్చింది. అది కొంచెం ఆలస్యంగా వెళ్ళింది సింహం దగ్గరకు.

ఆ సింహానికి పట్టరాని కోపం వచ్చి, 'ఎందుకింత ఆలస్యం అయింది? నేనెంత ఆకలిగా వున్నానో తెలుసా?' అని గర్జించి అడిగింది. దానికి ఆ కుందేలు ఎంతో వినయంగా 'రాజా! నేను మామూలు సమయానికే మీ దగ్గరకు బయలుదేరాను. కానీ నన్ను దారిలో మరొక సింహం అడ్డగించి, చంపి తినబోయింది. అప్పుడు నేను ఆ సింహంతో 'నేను ఈ రోజు మరొక సింహానికి ఆహారంగా వస్తానని మాట ఇచ్చాను ఇంతకు పూర్వమే. అందువల్ల నేను నీకు ఆహారం కాలేను' అని చెప్పాను. దానికి ఆ సింహం కోపంగా ఈ అరణ్యంలో నేను తప్ప మరొక సింహం వుండటానికి వీల్లేదు. దాని అంతు చూస్తాను' అని ఎటో వెళ్ళింది. నేను ఎలాగో తప్పించుకుని పారిపోయి వచ్చాను మీ దగ్గరకు అందుకే కొంచెం ఆలస్యం అయింది. నన్ను మన్నించండి' అన్నది కుందేలు తెలివిగా.

దాని నిజాయితీకి సంతోషించిన సింహం, ఆ రెండవ సింహం ఎక్కడ వున్నదో చెప్పు, నేను వెంటనే చూడాలి దాన్ని అన్నది. ఈ తెలివిగల కుందేలు, ఆ సింహాన్ని ఒక నూతి దగ్గరకు తీసుకువెళ్ళి ఆ నీళ్ళల్లో వున్నదని చూపించింది. ఆ నీటిలో తన నీడను చూసుకుని, అదే మరొక సింహం అనుకుని, దానిని చంపేయాలని ఆ తెలివితక్కువ సింహం ఆ నూతిలో దూకి తన ప్రాణాలను కోల్పోయింది.

అందుకే **'బుద్ధిర్ యస్య బలం తస్య'** అన్నారు. అంటే **తెలివిగల వారే మిక్కిలి బలవంతులు!** అని దాని అర్థం.

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**జులై 2019**

12 శుక్ర - తొలిఏకాదశి -సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

16 మంగళ - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

27 శని - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

**ఆగస్ట్ 2019**

15 గురు - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - ఉదయం 11 గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

23 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

25 ఆది - శ్రీగురుదశమి - ఉదయం 11గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**జులై 2019**

1 సోమ - మాస శివరాత్రి

2 మంగళ - అమావాస్య

12 శుక్ర - తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, ఏకాహం సంకీర్తన.

16 మంగళ - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. చంద్రగ్రహణం (రాత్రి 1-34ని॥ల నుండి తె.జా 4-30ని॥ వరకు.) చాతుర్మాస దీక్షా ప్రారంభము.

17 బుధ - దక్షిణాయణం ప్రారంభం.

27 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

30 మంగళ - మాసశివరాత్రి

జులై 13 నుండి ఆగస్ట్ 1 వరకు శ్రీమాతాజీ యూరప్ పర్యటన.

**ఆగస్ట్ 2019**

1 గురు - అమావాస్య

3 శని - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

9 శుక్ర - వరలక్ష్మీ వ్రతం

15 గురు - రాఖీ - జంధ్యాల పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

23 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - కలశస్థాపన, రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్తసమారాధన. రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ.

24 శని - ఉదయం 11గం. సామూహిక రాధాకృష్ణ పూజలు. భక్తసమారాధన.

25 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన, ఏకాహం సంకీర్తన.

26 సోమ నుండి సెప్టెంబర్ 1 ఆదివారం వరకు మౌన ధ్యాన సప్తాహ శిబిరం.

29 గురు - మాసశివరాత్రి

30 శుక్ర - అమావాస్య

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**తృతీయాశ్వాసము - 84 వ శ్లో॥**

**ఫుల్లేన్దీవరకాన్తి మిన్దువదన బర్హావతంస ప్రియమ్,**
**శ్రీవత్సాఙ్క ముదార కౌస్తుభ ధర పీతామ్బర సున్దరమ్,**
**గోపీనాం నయనోత్పలార్చిత తనుమ్, గోగోప సఙ్ఘావృతమ్**
**గోవిన్దం కల వేణునాదనిరత దివ్యాఙ్గ భూషం భజే॥**

తాత్పర్యము -

వికసించిన నల్లకలువల యొక్క కాంతిగలవాడును, చంద్రుని వంటి మోము కలవాడును, నెమలి పింఛమును శిరోభూషణమే ఇష్టమైనదిగా కలవాడును, శ్రీవత్సమను పుట్టుమచ్చగలవాడును, గొప్పదియగు కౌస్తుభమను మాణిక్యమును ధరించినవాడును, పచ్చని వస్త్రం కలవాడును, అందమైనవాడును, గోపికల యొక్క నేత్రములనెడి కలువ పువ్వులచేత పూజింపబడిన దేహము గలవాడును, అవ్యక్త మధురమైన వేణునాదమందు ఆసక్తిగలవాడును, సర్వోత్తమములైన అవయవములందలి ఆభరణములు గలవాడును అగు శ్రీకృష్ణుని నేను సేవించుచున్నాను.



## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా, జూలై, ఆగస్ట్ 2019 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జులై 2019 -*** AS 3728, 5744, 5916, 6405, 6587, 6872, 6875, 6888, 6894, 6936, 7514, 7786, 7787

***ఆగస్ట్ 2019 -*** AS 2153, 5457, 5937, 5957, 5958, 6900, 6906, 6907, 7517, 7673, 7746, 7788, 7790, 7798.

- మేనేజరు

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

మానవుడు సద్గురుమూర్తి సమాశ్రయం, అనుగ్రహం పొందకుండా, ఎంతకాలం ప్రయత్నించినా మనస్సు స్థిరపడదు. ఎందువలనంటే మనస్సు స్వాభావికంగా కొన్ని వృత్తులకు లోనై వుంటుంది. మనస్సు సంస్కరింపబడాలి. మనస్సు ఎప్పుడూ ప్రాపంచిక వ్యవహారాలు, విషయాదుల మీదనే మొగ్గు చూపుతుంది. దానినే అభినివేశము అంటారు. అంతేకాదు మనస్సుకి రెండు వృత్తులున్నాయి.



మనస్సే మాయ. మనస్సనే మాయ సాధకునికి రెండు రూపాలలో అవరోధంగా వుంటుంది. 1. ఆచ్ఛాదన. 2. భ్రమణం.

సూర్యభగవానుడికి మబ్బు ఆవరించి, మన దృష్టికి ఎలా దూరం అవుతున్నాడో, అలాగే మనస్సు ఆత్మ వస్తువుకి ఆచ్ఛాదనగా వుండి, దానిని గుర్తించ నీయకుండా అడ్డుపడుతుంది. అంతేకాదు అదే ఆవరణ. అదే నేను, నాది అనే ఆచ్ఛాదన.

మనస్సు స్థిరంగా వుండదు. చంచలమైనది. కదిలికలతో కూడినది. మనస్సుని శంకర భగవత్పాదులవారు ఒక కోతితో పోల్చారు. ఇదికాదు అది అని, అదికాదు ఇది అని, చెట్ల కొమ్మలపై గెంతుతూ వుంటుంది. దానినే భ్రమణం అంటారు.

నీటి యొక్క సహజ గుణం అది పల్లం వైపుకి పారుతుంది. అలాగే మనస్సు అనేది ప్రాపంచిక వ్యవహారాలవైపుకి మరలుతుంది. అంటే మనస్సు బహిర్ముఖమవుతుంది. అంతేకాదు మనస్సులో క్లేశాలు వుంటాయి. ఈర్ష్య, అసూయ, క్రోధం, ఇది నాది అనే రాగం, అది పరాయిది అనే ద్వేషం, మంచికలిగితే సుఖం, చెడు కలిగితే దుఃఖం కలిగిస్తుంది మనస్సు.

వీటన్నిటి నుండి ముక్తిని కలిగించే శక్తి సాధకునికి లేదు. వీటి నుంచి విముక్తిని పొందటమే ముక్తి. అదే బంధ విముక్తి. ఇది కేవలం సద్గురుమూర్తి అనుగ్రహం ద్వారా మాత్రమే సంభవం. సద్గురుమూర్తి బోధా శ్రవణం ద్వారా బుద్ధి ప్రేరణ చెంది వివేకవంతమవుతుంది. ఇదే నిత్యానిత్యవివేకము. అదే శుభేచ్ఛ.

బుద్ధి ఎప్పుడు వివేకవంతమవుతుందో అప్పుడు బుద్ధి మనస్సులో

లీనమై, మనస్సుని సంస్కరించి మనస్సులో విచారణ అనేది ప్రారంభమవుతుంది. మనస్సులో మననం జరుగుతుంది. శ్రవణం ద్వారా ప్రేరణ చెందిన బుద్ధి మనస్సుని మననానికి ప్రేరేపించడం ద్వారా విచారణకి దారి తీస్తుంది. విచారణ ద్వారా ప్రాపంచిక దృష్టి క్షీణిస్తుంది. అందువలన సత్సంగాలలో పాల్గొనటం ద్వారా మనస్సుకి ఆహారం అందుతుంది. మనస్సు సంస్కరింపబడే అవకాశం వుంటుంది. శ్రద్ధగా శ్రవణం చేయడం వలన ప్రేరణ చెందిన బుద్ధి మననానికి ప్రోత్సహించి, దాని ద్వారా బుద్ధి మనస్సులో లయమై, విచారణకి దోహదం చేసే స్థితి ధ్యానము. ఆ స్థితిలో మనస్సు స్థిరపడుతుంది.

మనస్సు స్థిరపడినట్లు మనకి సంకేతం ఏమిటి? ప్రాపంచిక దృష్టి నశించాలి. దాని ఫలితంగా వైరాగ్యం కలుగుతుంది. సాధనలో కొంతమంది శ్వాస మీద దృష్టి అని, క్రియా యోగము అని రకరకాలుగా వుంటారు. ప్రాణాయామంలో రేచకం, పూరకం, కుంభకం అని మూడు దశలు వుంటాయి. ఒకవేలుతో ఒకప్రక్క ముక్కుని పట్టివుంచి, రెండవవైపు లోపలికి ప్రాణవాయువును పీల్చటం పూరకం. ఆ తరువాత లోపలికి పీల్చినగాలిని కొన్ని క్షణాలు లోపల నిలిపి వుంచుతారు. దానినే కుంభకం అంటారు. ఆ తరువాత ఆ వాయువును బయటకు వదలటాన్నే రేచకం అంటారు. ఇలా చేయడం వలన ఆ క్షణంలో మనస్సు నిలబడవచ్చు. కాని ఆ మరుక్షణమే మనస్సు మళ్ళీ యథాస్థితిని పొందుతుంది. ఎందువలనంటే మనస్సు వృత్తి రహితం అవ్వాలి. అది ప్రాణాయామం ద్వారా సాధ్యపడదు. సద్గురుదేవులు హెచ్చరిస్తూ "ఈ రకమైన ప్రాణాయమం వలన కొన్ని సందర్భాలలో రక్తనాళం చిట్లి ప్రమాదం జరుగవచ్చు" అన్నారు.

దీనికి ప్రత్యామ్నాయంగా ధ్యానానికి కూర్చున్నప్పుడు ఓంకారాన్ని పూరించడం ద్వారా, ప్రాణవాయువు లోపలికి ప్రవేశించి అదే పూరకం అవుతుంది. ఆ తరువాత ఓంకార పూరణ అవగానే కుంభకం, దాని తరువాత మరొకసారి ఓంకారాన్ని పూరించే లోపు రేచకం పూర్తి అవుతుంది. ఇది ధ్యానంలో భాగం. అలా నిరవధికంగా ఓంకారాన్ని పూరించడం ద్వారా ప్రాణాయామం జరిగి ఇంద్రియ నిగ్రహాన్ని సాధించగలుగుతాడు. సహజంగా మనస్సు స్థిరపడుతుంది.

# చిత్త కుసుమం - పాలూరి కాళీప్రసాద్

**గభీరే కాసారే విశతి విజనే ఘోరవిపినే**
**విశాలే శైలే చ భ్రమతి కుసుమార్థం జడమతిః।**
**సమర్ప్యైకం చేతస్సరసిజం ఉమానాథ భవతే**
**సుఖేనావస్థాతుం జన ఇహ న జానాతి కి మహో॥**

మనం ఈ మధ్యనే శ్రీ శంకరజయంతి జరుపుకున్నాం కదా. శ్రీ మాతాజీవారు తరచుగా శ్రీ శంకరాచార్య విరచితమైన శివానందలహరి లోని ఈ శ్లోకాన్ని ప్రస్తావిస్తూ వుంటారు.



శంకరులవారు జనుల అవివేకాన్ని ప్రశ్నిస్తూ ఉమానాథుడైన పరమేశ్వరునితో ఇలా అంటున్నారు 'ఓ ఉమానాథా! జడమతులైన ఈ జనులు తమ చిత్తమనే కమలాన్ని నీకు సమర్పించి, సుఖంగా కూర్చోవచ్చునని తెలియక, బయట పుష్పాల కోసం లోతైన తటాకాలలో, నిర్జనమైన ఘోరారణ్యాలలో, విశాలమైన పర్వతాలపైన వాటిని వెతుక్కుంటూ ఎంతో కష్టపడుతున్నారు. ఎంత ఆశ్చర్యం!'

అంతఃకరణ చతుష్టయంలో మనస్సు సంకల్పిస్తుంది, బుద్ధి నిర్ణయిస్తుంది, అహంకారం ఆ నిర్ణయాన్ని అమలులో పెడుతుంది. అయితే చిత్తం ఈ ప్రక్రియనంతటినీ రికార్డు చేస్తుంది. ఈ రికార్డులే తరువాత జన్మజన్మలకు వాసనలై మన వెంట పడుతున్నాయి. మన చిత్తంలోని ఈ వాసనల నుండి పుట్టేవే కామ క్రోధాది గుణాలు. ఈ వాసనలు కలిగి వుండటం వలననే ఇక్కడ స్వామి మనఃపుష్పం అనకుండా చిత్తాన్ని కమలంతో పోల్చారేమో!

ఈ వాసనలు మూడు రకాలు - శాస్త్ర వాసన, లోక వాసన, దేహ వాసన. శాస్త్రాలను ఎంత లోతుగా అధ్యయనం చేసినా, ఈ శాస్త్ర వాసన ఇంకా పెరుగుతుందే తప్ప తరగదు. అందుకే లోతయిన తటాకాలలో, శాస్త్రాలలో వెదికి ఉపయోగం లేదు. అలాగే జనసమూహాన్ని

వదిలివేసి, ఎంత నిర్జనారణ్యంలో ముక్కుమూసుకుని కూర్చున్నా, లోకవాసన వదలటం కష్టం. అందుకే నిర్జనారణ్యంలో వెదకి ఉపయోగం లేదని స్వామి ఇక్కడ హెచ్చరిస్తున్నారు. ఇక దేహాన్ని పోషించుకునే క్రమంలో తన వృత్తి ధర్మాచరణలో ఎంతటి ఉన్నత శిఖరాలను అధిరోహించినా, దేహవాసన ఇంకా పెరుగుతుందేకాని తరుగదు. అందుకే విశాల శైలాలపై కూడా వెదకి ఉపయోగం లేదని స్వామి చెబుతున్నారు.

ఇక ఇక్కడ పరమేశ్వరుని ఉమానాథా! అని సంబోధించడంలో కూడా మనకు ఒక సూచన వున్నదనిపిస్తోంది. పార్వతీదేవి పరమేశ్వరుని పతిగా పొందాలన్న సంకల్పంతో తన చెలికత్తెలతో కలసి స్వామి తపస్సు చేసుకునే ప్రదేశానికి చేరి, పైన చెప్పినట్లుగానే రోజూ అనేక పుష్పాలను సేకరించి, స్వామిని పూజిస్తూ, సపర్యలు చేస్తూ, ఎంతోకాలం గడిపింది. అయినా స్వామి మనస్సును మెప్పించలేకపోయింది. చివరికి అమ్మను స్వామితో కలిపే ప్రయత్నంలో మన్మథుడు కూడా దహనం అయిపోయిన తరువాత ఆ తల్లి ఇక బయట ప్రయత్నాలు వదిలివేసి, తనలోకి తాను వెళ్ళి, ఆ తపస్సు ద్వారా స్వామిని పొందాలని నిర్ణయించుకున్నది. అయితే ఈ తపస్సును తల్లి అయిన మైనాదేవి, ఇతర చెలికత్తెలు వారించటంలో భాగంగా 'ఆ పని వద్దు వద్దు' అని చెప్పడం వలన ఆమెకు 'ఉమ' అనే పేరు వచ్చిందని పెద్దలు తెలిపారు. అయితే ఈ వాసనాత్రయాన్ని జయించిన అమ్మ తనలోతాను లీనమై తపస్సు చేస్తూ వుండగా ఆ స్వామి తానే స్వయంగా వచ్చి, అమ్మను పరీక్షించి మరీ తనదానిని చేసుకున్నాడు. ఇలాగే మనం కూడా మన ధర్మాన్ని ఆచరిస్తూనే, ఈ సంఘంలో వుంటూనే చిత్తాన్ని భగవదాయత్తం చేసి, మనలోపలి అసలు సత్యాన్ని కూర్చున్నచోటనే వుండి హాయిగా గుర్తించి, అనుభవించి, ఆ శివానంద లహరిలో ఓలలాడమని జగద్గురువులయిన శ్రీ శంకరాచార్యస్వామివారు మనకు ఈ రూపంగా బోధిస్తున్నారు.

(గత సంచిక తరువాయి) **కైవల్యోపనిషత్** - రేఖ

ఈ ఆత్మస్థితి అదే అమృతత్వ స్థితి. ఈ స్థితిని (ఆత్మానుభూతి) అనుభవించడానికి ధ్యానం (మథనం) యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ క్షీరసాగర మథనం యొక్క అర్థాన్ని వివరించారు.

ధ్యాన ప్రక్రియలో మన హృదయం అనే పాలసముద్రంలో మనలోని శుద్ధ సాత్విక మనస్సే పాలకడలి. మనలోని బుద్ధి మంధర పర్వతము, మథించే త్రాడు మన అహంకారం అనే వాసుకి. మనలోని నీచగుణాలు అసురులు, ఉత్తమ గుణాలు దేవతలు. అంటే మనలోని మంచి చెడులే దేవాసురులు.

ధ్యానించేటప్పుడు అంటే మథన చేస్తూవుంటే అమృతత్వాన్ని అనుభవించే ముందు మన అహంకారమనే వాసుకి అంతరంగంలో తెలియకుండా వుండే వాసనలు, భూత, భవిష్యత్, వర్తమాన కాలములకు సంబంధించిన విషయాలలో ఆలోచన అనే విషాన్ని వెడలగ్రక్కుతాయి. ఇవికాకుండా మనలో ప్రలోభం కలిగించే కొన్ని సిద్ధులుపైకి వస్తాయి. అవే ఐరావతం, కామధేనువు, కల్పవృక్షము మొదలైనవి. అంటే సాధన పరంగా చెప్పుకోవాలంటే ఓంకార శబ్దం వినిపించడంవంటివి.

ఇంకా కొన్ని సిద్ధులు కలగటంవంటివి జరుగుతాయి. అయితే వాటిని తూష్ణీ భావనతో వదిలివేయాలి. సిద్ధులను కూడా పట్టించుకో కూడదు. జ్ఞానం వస్తేగానీ అజ్ఞానమనే విషం పూర్తిగా నశించదు. హృదయాన్నిగాని, బుద్ధినిగాని, అహంకార మమకారాలు విషపూరితం చేయకూడదు. అప్పుడే ఆ అమృతత్వ స్థితిని సాధకుడు అనుభవించగలడు.

ధ్యానం యొక్క ఆవశ్యకత. విక్షేపాలు ఏమీ వుండని ప్రశాంత స్థితి అది. ఈ స్థితి పరమాత్మని సూచిస్తుంది. సమస్తమునకు సాక్షి కేవలం సాక్షిగా వుంటుంది. సూర్యుడు ఒక్కడే ఆకాశంలో వుండి సమస్త సృష్టిని ప్రకాశింపజేస్తున్నాడు. ఆ సూర్యుడి నుండి పుష్టినీ, జీవ శక్తిని పొంది, మానవుడు సూర్యోదయంలో మేల్కొని ప్రతి ఒక్కడూ తన వాసనానుగుణంగా ఆయా కార్యకలాపాలలో ప్రవర్తిస్తాడు. కానీ ఆ పనులు వేటికీ సూర్యుడు బాధ్యుడు కాదు. అదే విధంగా చరాచర సృష్టికీ

సాక్షిగా వుండి శక్తినిచ్చేది ఆ పరమాత్మ.

మానవుడు ఈ సత్యాన్ని గుర్తించకపోతే, వున్నదానిలోనే వుంటాడు. దేహ మనో బుద్ధులు, వాసనలు, మనని బలహీనపరుస్తాయి. కానీ అసలు సత్యవస్తువు దగ్గర ఇవేవీ లేవు అని గుర్తించాలి. శ్రీబాబూజీ ముఖస్థగా వచ్చిన కీర్తన ....

ఎవని కృపచే వినును కర్ణములు నాదమును, ఎవని కృపచే చూచును విస్మయమును

ఎవని కృపచే పలుకును అమృత రసన, ఎవని కృపచే సుఖసమేతముగ వసింతుము.

ఎవని కృపచే పరమగతి లభించును, ఎవని కృపచేత సుఖము సంభవం

అట్టి ప్రభుని త్యజించి వేరొకని యందు లగ్నమగుటేలరా!

గురుకృపచే భక్తి మనసా మేలుకో!

అన్ని ఉపనిషత్తులు, వేదాలు ఒకే ఒక్క విషయాన్ని గురించి సూచిస్తున్నాయి, గుర్తింపజేస్తున్నాయి. గుర్తిస్తే అదే అయిపోతాము. తత్వాన్ని గుర్తించాలి, అనుభవించాలి, వేరే మార్గము లేదు అని ఘోషిస్తున్నాయి.

సూర్యుని వంక కొంచెంసేపు చూసి మళ్ళీ పక్కకి చూస్తే మన కళ్ళకు తాత్కాలికంగా ఏమీ కనబడదు. ఎందువలనంటే మన కళ్ళకాంతి చూసే శక్తికంటే సూర్యుని కాంతి ఎన్నో రెట్లు ఎక్కువ.

ఎలాగయితే మిణుగురుపురుగు కాంతి సూర్యకాంతిలో తెలియదో, కేవలం చీకట్లోనే తెలుస్తుందో అలాగే మానవుడు కూడా తనని నడిపిస్తున్నది ఎవరో తెలియకపోతే, తన శక్తి వలనే ఆ కార్యాలన్నీ చేయగలుగుతున్నా ననుకుంటాడు. ఆ గుర్తింపు లేకపోవడమే అంధకారం, అజ్ఞానం.

- సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## బొంబాయి శాస్త్రిగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

"నా ఉద్యోగరీత్యా ఎన్నో ఆశ్రమాలు, మఠాలు, స్వాములవార్ల ఆర్థిక లావాదేవీలను దర్యాప్తు చేయటానికి వెళ్ళే వాణ్ణి. ఇంచుమించు అన్ని సందార్భాలలోను అవకతవకలు, లొసుగులు, అక్రమాలు మా దృష్టికి వచ్చేవి. ఆ కారణంగా నాకు స్వాములన్నా ఆశ్రమాలన్నా గౌరవం లేకపోగా, కొంచం చులకన భావనే ఉండేది. త్వరగా ఎవరినీ నమ్మలేకపోయే వాణ్ణి. అందువలన నేను తమ వద్దకు ఇన్నాళ్ళనుండీ వస్తున్నా, ఇంతవరకు తలవంచి తమకు నమస్కరించ లేదు. నేను కొంత క్రమశిక్షణకు అలవాటు పడిన వాణ్ణి. త్రికాల సంధ్యా వందనమే నా ప్రధానమైన అనుష్ఠానము. గాయత్రీ మాతయే నా అధిష్ఠాన దైవము. నీతి నియమాలే ఆస్తి అని నా నిశ్చితాభిప్రాయం. ఇంత వరకు నేను గమనించిన దాన్ని బట్టి తమ సన్నిధిలో, నేను నమ్మిన ఆదర్శాలన్నీ నిత్యాచరణలో ఉన్నట్లు యిప్పుడు నాకు నమ్మకం కుదిరింది. అందుకని నేనిప్పుడు తమకు సాష్టాంగ వందనం చేసుకుంటాను".



శ్రీ గుండు నాగేశ్వర శాస్త్రిగారు ( బొంబాయి శాస్త్రిగారు) మొదటిసారిగా శ్రీబాబుకు నమస్కరించినప్పుడు అన్న మాటలివి.

శ్రీబాబు అందుకు జవాబుగా "మీ దృక్పథాన్ని నేను పూర్తిగా బలపరుస్తాను. మహాత్ములుగా ఎంతటి పేరున్నవారైనా, వారిని విశ్వసించి ఆశ్రయించే ముందు, మానవుడు తన మనస్సుకు పూర్తి నమ్మకము నిశ్చయము కలిగే వరకు తనకు తోచిన విధంగా పరీక్షించుకోవచ్చు. విశ్వాసం లేకుండా చేసే నమస్కారమునకు విలువ లేదు; ఫలితమూ లేదు. శ్రీ వివేకానంద స్వామి శ్రీ రామకృష్ణ పరమహంసను అలాగే పరీక్షించుకున్నారు.

ఒకసారి నమ్మకాన్ని దృఢపరచుకొని గురువును ఆశ్రయించిన తరువాత, ఎన్ని పరీక్షలెదురైనా, మహా మాయ తనను ఎంతగా తలక్రిందులు చేసే ప్రయత్నం చేసినా, ఆశ్రయించిన గురుపాదమును

విడువక సేవించుకున్నవాడే గురుకృపకు పాత్రుడై సాధనలో విజయాన్ని సాధించ గలడు” అన్నారు.

బొంబాయి శాస్త్రిగారు ఏలూరు వాస్తవ్యులు. మిలిటరీలో కొంత కాలం పనిచేసి తరువాత బయటకు వచ్చి, బొంబాయిలో అకౌంటెంట్ జనరల్‌గా ఆఫీసులో చాలా కాలం పనిచేసి 1946లో రిటైరైనారు. ఆశ్రమ స్థాపనానంతరం సతీ సమేతులై ఆశ్రమంలో అయిదారు సంవత్సరాలు వానప్రస్థులై గడిపారు. తాము నమ్మిన దానిని త్రికరణ శుద్ధిగా ప్రీతితో ఆచరించడం బొంబాయి శాస్త్రిగారి స్వభావము. వారు స్ఫురద్రూపులు; ఆజానుబాహులు. వారి ధర్మపత్ని అన్నపూర్ణమ్మ గారు చాలా పొట్టివారు. బొంబాయి శాస్త్రి గారికి మొదట్లో ఆమెను వివాహం చేసుకోవటం సుతరామూ యిష్టం లేదు. శ్రీ కందర్ప పరశురామయ్యగారి యెడల వారు అత్యంత గౌరవ భావము కలిగి ఉండేవారు. పరశురామయ్య గారు శాస్త్రిగారితో “ ఈ సంబంధము నీ జీవితంలోనే గొప్ప మలుపును తీసుకుని వస్తుంది. భగవదనుగ్రహం నీ పై పూర్తిగా వర్షిస్తుంది. నా మాటను విశ్వసించి అన్నపూర్ణను వివాహం చేసుకో ”మన్నారు.

సరిగా ఆ సమయంలోనే , వారిద్దరూ మాట్లాడుకుంటున్న చోట ఉన్న చెట్టుపై నుండి వారిపై పూలు జల జలా రాలాయి. అది దైవ సూచనగా భావించిన శాస్త్రిగారికి పరశురామయ్యగారి మాటపై ఎనలేని విశ్వాసం ఏర్పడింది. శాస్త్రిగారు మనస్ఫూర్తిగా ఆమెను వివాహం చేసుకోవటమే గాక , ఆ తరువాత తమ జీవితాంతము వరకు ఆమెను ఎంతో ప్రేమానురాగాలతో చూసుకున్నారు. తాము ఎక్కడికి వెళ్ళినా , ఎటువంటి న్యూనతా భావమును పెట్టుకొనక ఆమెను వెంట తీసుకుని వెళ్ళి , ఆమెకు ఆనందం కలిగించే వారు.

శాస్త్రిగారికి యిద్దరు పుత్రులు- యజ్ఞ నారాయణ, దీక్షితులు. వాళ్ళు ఉన్నతోద్యోగాలలో ఉంటూ కూడా మాతాపితరులపై అనన్యమైన భక్తిగలవారు. పెద్ద కుమారుడు యజ్ఞ నారాయణకు పరశు రామయ్యగారి మనుమరాలు (వారి రెండవ అల్లుడైన నేలభొట్ల రామమూర్తిగారి జ్యేష్ఠ కుమార్తె ) గాయత్రితో వివాహమైనది.

- సశేషం

# శ్రీమాతాజీవారి విదేశ పర్యటన కార్యక్రమాలు

జూలై 2019
01 వాషింగ్‌టన్( వర్జీనియా) చేరి, శ్రీ కాళీ ప్రసాద్ నూనె, శ్రీమతి అలేఖ్య దంపతుల గృహంలో (సెల్: + 1-267-357-7956)ఉంటారు.
04-7-2019 నుండి 07-07-2019 వరకు సత్సంగం.
04-07-2019న శ్రీనూనె కాళీ ప్రసాద్. అలేఖ్య దంపతులచేత త్రయాహ్నిక దీక్ష ప్రారంభింపజేస్తారు. అమెరికాలోని వివిధ ప్రాంతాలనుండి భక్తులు అక్కడకు వచ్చి ఈ కార్యక్రమాలలో పాల్గొంటారు.
07-07-2019న దీక్షా విరమణ, మహామంగళహారతితో అక్కడ కార్యక్రమాలు ముగుస్తాయి.
08 శ్రీశ్రీనివాస ప్రసాద్ దుగ్గిరాల, శ్రీమతి పద్మ దంపతుల గృహంలో వుంటారు (సెల్:001-404-509-9597).
10 బోస్టన్ చేరుతారు. అక్కడ అన్నం బాబు ప్రసాద్ గారి వద్ద వుంటారు. (సెల్ నెం. 001(732)986-7587)
12 అమెరికా నుండి బయలుదేరి
13-7-2019న నార్వే చేరుతారు. శేషప్రసాద్, శ్రీమతి గీత దంపతుల గృహంలో కార్యక్రమాలు జరుగుతాయి. సెల్ 004745282464
16 - గురుపూర్ణిమ నాడు శ్రీ సద్గురు పాదపూజ జరుగుతుంది.
18 అమ్‌స్టర్‌డామ్ (నెదర్‌లేండ్స్) చేరి అక్కడ కరుణాకర చరణ్, జ్యోత్స్న, మరియు ఆదిత్య, రాజీ గార్లు శ్రీమాతాజీ వద్ద ఉంటారు. సెల్ - 0031687448929. శ్రీ కుమారస్వామి రాజా, కోమలి దంపతులు కూడా శ్రీ మాతాజీతో ప్రయాణం చేస్తారు.
21 - లండన్ చేరుతారు. తవ్వా ప్రసాద్‌గారింట్లో వుంటారు.
22 - లండన్ నుండి స్కాట్‌లాండ్ చేరి శ్రీ కాళీచరణ్, ప్రసన్న దంపతుల గృహంలో (సెల్: 07738226171)ఉంటారు.
25 లండన్ చేరి,శ్రీ తవ్వా ప్రసాద్ దంపతుల గృహం చేరుకొంటారు (సెల్ నెం. 07990523652)
27 - సెంట్ జాన్ విలేజ్ మెమోరియల్ హాల్, సెంట్ జాన్ లై, సెంట్‌జాన్స్ వోకింగ్‌లో సామూహిక శ్రీ సత్యన్నారాయణ వ్రతం, కుంకుమపూజలు జరుగుతాయి.
28 - 30 వరకు త్రయాహ్నిక దీక్షతో సత్సంగ కార్యక్రమాలు ఉంటాయి. 30 - దీక్షా విరమణ, మహా మంగళహారతి.
31శ్రీమాతాజీ వారు బయలుదేరి. 1-8-2019న ఢిల్లీ చేరుతారు.

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు - రమణ ప్రసాద్

# శ్రీ స్వామి వివేకానంద

పాశ్చాత్య పయనానికి సన్నాహాలు

"1893 మే లో ఖేత్రీ మహారాజుగారు నన్ను అమెరికా పంపటానికి అన్ని ఏర్పాట్లు చేశాడు. నేను ఇప్పుడు కాశీ విడిచి వెళ్తున్నాను. ఒక బాంబులా సమాజం మీద పేలిన తరువాతగాని తిరిగిరాను."అని నిశ్చయించుకున్నాను.



"అమెరికా బయలుదేరటానికి ముందు మాతృశ్రీ శారదా దేవి ఆశీస్సులు లభించాయి. అంతే! ఒక్క గంతులో సముద్రాన్ని లంఘించాను. విశ్వమత సభలు - ఇందు నిమిత్తమే (తనను సూచిస్తూ) ఏర్పాటు చేయబడుతున్నాయి అని నా మనస్సు చెబుతోంది. త్వరలోనే అది నిరూపణ అవుతుంది."

బొంబాయి నుండి కొలంబో చేరుకున్నాం. అక్కడ ఓడ ఒకరోజు ఆగింది. నేను నగర వీధులలో పయనిస్తూ ఒక పెద్ద బుద్ధ భగవానుని విగ్రహం నిర్వాణంలో ప్రవేశిస్తున్న రీతి మలచబడింది. దానిని చూశాను. హాంకాంగ్, చైనాల మీదుగా పయనించి జపాన్ నాగసాకి దగ్గర ఓడ దిగి యోకహామాలో ఎన్నో దేవాలయాలు చూశాను. జపాన్ నుండి వాన్‌కోవర్ చేరాను. ఇక్కడ చలి బాగా ఎక్కువగా ఉంది. ఉన్ని దుస్తులు లేక చాలా బాధపడ్డాను. వాన్‌కోవర్ నుండి కెనడా గుండా చికాగో చేరాను. చికాగోలో పన్నెండు రోజులు ఉన్నాను. ఇక్కడ ఖర్చులు భరించలేక తిరిగి భారత దేశానికి వెళ్ళిపోవాలని అనుకున్నాను. కాని ధృఢ సంకల్పుడనై ఉన్నాను. నాకు భగవదాదేశం ఉంది. ఆయన దివ్యనేత్రాలు నన్ను కనిపెట్టి ఉన్నాయి."

"కొన్నాళ్ళు బోస్టన్ లో ఒక వృద్ధురాలికి అతిథిగా ఉన్నాను. నా ఖర్చును

పొదుపు చేసుకోవటానికి  ఇది ఒక చక్కని అవకాశం.”

“చికాగోలో కపూర్తలా రాజు అక్కడ ఉన్నాడు.  ఆయనను కలిశాను. మర్నాడు పత్రికలలో ‘భారతదేశం నుంచివచ్చిన మేధావి ’అని నన్ను ఆకాశానికి ఎత్తుతూ పత్రికలలో వేశారు.  మహిళా కారాగార పర్యవేక్షకురాలయిన శ్రీమతి జాన్సన్‌ను కలిశాను. ఇక్కడ కారాగారాన్ని రిఫార్‌మిటరీ (సంస్కరణాలయం) అంటారు.  బోస్టన్‌లో నేను ఎరుపురంగు కోటు తలపాగా ధరించి వెడుతుంటే అనేక మంది బాలురు నా వెంటపడ్డారు.  అతి కష్టంతో వారి బారి నుంచి తప్పించుకున్నాను.   ఆఖరు క్షణంలో నేను కాంగ్రెస్ సభలో ఊడిపడ్డాను. అసంసిద్ధుడిగానే వెళ్ళాను. చాలా చోట్ల ప్రసంగాలు చేశాను.

గ్రీక్ భాషా బోధన చేసే ప్రొఫెసర్ రైట్ తో పరిచయమైంది.  వారు నన్ను విశ్వమత సభలలో ప్రసంగించటానికి ఎన్నో ఏర్పాట్లు చేశారు.  విశ్వ మత సభలో ప్రొద్దుట జరిగిన సభలో వివేకానంద మాట్లాడవలసి వచ్చినప్పుడు “నాకు కొంత సమయం కావాలి” అన్నారు డెలిగేట్స్. వారంతా తమ పేపర్లను వ్రాసుకొని వచ్చారు.  తనవద్ద ఏదీలేదు.

తన వంతు వచ్చింది.  సాయంత్రం సభలో వివేకానంద లేచి నుంచుని గంభీరమైన గొంతుతో  "Sisters and brothers of America!" (అమెరికా సోదర సోదరీమణులారా!) అన్నారు, అంతే అక్కడ ఉన్న యావన్మందీ రెండు నిముషాలపాటు చప్పట్లతో అభినందనలు తెలిపారు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL